ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం, 25 జూన్ 2024



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభం

- తొలిరోజే కలెక్టరేట్‌కు పోటెత్తిన జనం
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), జూన్ 24 : కొత్తగా రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహించారు. తొలిరోజే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జనం పోటెత్తారు. కలెక్టర్ హరినారాయణన్ స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇరిగేషన్, హౌసింగ్, భూ సమస్యలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు చెందిన అర్జీలు అధిక సంఖ్యలో వచ్చాయి. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సేదుమాధవన్, డీఆర్వో లవన్న, జడ్పీ సీఈఓ కన్నమ నాయుడు, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడు నెలల నుంచి గ్రీవెన్స్ కార్యక్రమం ఆగిపోయింది. ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరటంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పునఃప్రారంభమైంది.

- జగనన్న కాలనీల్లో నాసిరకం గృహాల అవినీతిపై విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో నిర్మించిన పక్కా గృహాలకు పగుళ్లు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ నిర్మాణాల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ సత్వరమే విచారణ జరిపించాలని కోరారు.
- నెల్లూరులో మైసూర్ రాజ్యపాలకుడైన టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేయాలని ముస్లిం ఫెడరేష్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ జియా ఉల్‌హక్ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.

వచ్చే నెలలో రొట్టెల పండుగ

- నిర్వహణకు 17 నుంచి సన్నాహాలు
- కార్పొరేషన్ రూ.3.1 కోట్ల కేటాయింపు
- 41 పనులకు టెండర్లు

నెల్లూరు (సిటీ), జూన్ 24 : రాష్ట్ర పండుగగా జరుపుకునే నెల్లూరులోని బారాషహీద్ రొట్టెల పండుగకు ఈసారి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జూలై 17వ తేదీ నుంచి ఐదు రోజులపాటు స్వర్ణాల చెరువు చెంతన జరిగే ఈ వేడుకకు ముస్లింలతోపాటు హిందువులు భారీగా తరలివస్తారు. ఇందుకోసం నగర పాలక సంస్థ వివిధ ప్రజా అవసరాల పనులకు రూ.3.1 కోట్లు కేటాయించింది. పారిశుధ్యం, మంచినీరు, ప్రైవేట్ కూలీలు, చెత్తతరలింపునకు ప్రైవేట్ వాహనాలు, భోజనాలు తదితర



అంశాలతో కూడిన 41 పనులకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేశారు. పండుగ నిర్వహణ ఏర్పాట్లలో కార్పొరేషన్ యంత్రాంగం నిమగ్నమైంది. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువు తీరిన తరువాత తొలిసారిగా దర్గా వద్ద రొట్టెల పండుగ జరుగుతుండటంతో ప్రజాప్రతినిధులు కూడా అట్టహాసంగా నిర్వహించాలని సిద్ధమయ్యారు. దర్గా వ్యవహారాలన్నీ వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉన్నా నిర్వహణ ఏర్పాట్లు కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్నాయి. అధికారులు, సిబ్బందికి విధులకు కేటాయించేందుకు దస్త్రాలు సిద్ధం చేస్తున్నారు. పారిశుధ్యం, మంచినీరు, మరుగు దొడ్ల నిర్వహణను తొలి ప్రాధాన్యంగా తీసుకుని పనులు మొదలుపెడుతున్న కార్పొరేషన్ అధికారులు గత అనుభవాలను నెమరువేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతుల సేవలో తరిస్తూ ప్రభుత్వ సంస్థలకు సేవలందిస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలో (డీసీఎంఎస్) 'లెక్క'లేని తనం నెలకొంది. ఇక్కడ జరుగుతున్న ఆర్థిక లావాదేవీలపై గడిచిన మూడేళ్లుగా ఆడిట్ జరగడం లేదు. ఈ విషయమై సహకార శాఖ ఆడిటర్లు పలుమార్లు నోటీసులు జారీ చేసినా బేఖాతరు చేస్తున్నారు. చట్ట విరుద్ధంగా ప్రైవేటు ఆడిటర్లతో ఆడిటింగ్ చేయించుకోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ఇప్పటికైనా సహకార శాఖ ఆడిటర్ల చేత ఆడిటింగ్ చేయించాలని పలువురు తాజాగా జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

\- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)





పడిపోయిన వ్యాపార వృద్ధి

గడిచిన ఐదేళ్లలో భారీగా నిధులు పక్కదారి పట్టినట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో డీసీఎంఎస్ వ్యాపార వృద్ధి కూడా పడిపోయినట్లు చెప్పుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీసీఎంఎస్‌లో సిబ్బందిని నియమించుకోవడం, వారికి భారీగా జీతాలు చెల్లించడమే కాకుండా చాలా మందిని పర్మినెంట్ కూడా చేసినట్లు తెలుస్తోంది. ఎరువుల విక్రయాల్లో కూడా లెక్కలు తేలడం లేదని సమాచారం. ధాన్యం కొనుగోళ్లు జరిపినందుకు గానూ హమాలీ చార్జీలను ప్రభుత్వం డీసీఎంఎస్‌కు చెల్లించినా వాటిని హమాలీలకు చెల్లించలేదని గతంలో కొందరు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. ఆ తర్వాత కొంత మందికి కొద్ది మొత్తం మాత్రమే చెల్లించి మిగిలిన మొత్తాన్ని పక్కదారి పట్టించినట్లు హమాలీలు ఆరోపిస్తున్నారు. వైసీపీ నేతల చేతుల్లో డీసీఎంఎస్ కునారిల్లిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చట్ట ప్రకారం తాము ఆడిట్ చేయాలని సహకార శాఖ అధికారులు అనేక మార్లు డీసీఎంఎస్‌కు నోటీసులు పంపినా వారు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇతర సహకార సంస్థలకు ప్రభుత్వ అధికారులు ఆడిటింగ్ చేస్తుండగా ఒక్క డీసీఎంఎస్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఇకనైనా సహకార శాఖ ఆడిటర్ల చేత ఆడిటింగ్ చేయించాలంటూ పలువురు ఉన్నతాధికారులకు లేఖలు రాస్తున్నారు. మరి ఇప్పటికైనా ఉన్నతాధికారులు డీసీఎంఎస్‌పై దృష్టి పెడతారో.. లేదో.. చూడాలి.

డీసీఎంఎస్‌లో లెక్కలేని తనం

- మూడేళ్లుగా జరగని ప్రభుత్వ ఆడిట్
- ప్రైవేట్ ఆడిటర్లతో చేయిస్తున్న వైనం
- పలుమార్లు నోటీసులు ఇచ్చిన సహకారశాఖ
- అయినా పట్టించుకోని డీసీఎంఎస్ అధికారులు
- భారీగా నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు

రైతులకు సేవలందించడంలో డీసీసీబీ, డీసీఎంఎస్ సంస్థలది కీలక పాత్ర. డీసీసీబీ ద్వారా రైతులకు రుణాలు అందిస్తుండగా, డీసీఎంస్ ద్వారా ఎరువులు అందిస్తున్నారు. అదే సమయంలో డీసీఎంఎస్ సంస్థ ఇతర ప్రభుత్వ సంస్థలకు సేవలందిస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటోంది. ధాన్యం కొనుగోళ్లు, పాఠశాలలకు అవసరమైన వస్తువుల సరఫరా, టీటీడీకి పప్పు దినుసుల సరఫరా వంటి అనేక వ్యాపారాలను గతంలో డీసీఎంస్ నిర్వహించింది. అటువంటి సహకార సంస్థ తీరు గడిచిన కొన్నేళ్లుగా వివాదాస్పదంగా మారింది.

● నిధుల వినియోగంపై ఆరోపణలు

ముఖ్యంగా డీసీఎంస్‌లో నిధుల దుర్వినియోగంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఎంత ఆదాయం వస్తోంది? ఎంత ఖర్చు చేస్తున్నారు? వంటి లెక్క తేలడం లేదు. సహకార శాఖకు చెందిన ప్రభుత్వ ఆడిటర్లు చేత గడిచిన మూడేళ్లుగా ఆడిటింగ్ చేయించకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో సహకార శాఖ ఆడిటింగ్ చేయగా, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఎందుకు ప్రైవేటు వ్యక్తుల చేత ఆడిటింగ్ చేయిస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ అధికారులు ఆడిటింగ్ చేస్తే అవకతవకలు బయటపడే అవకాశముందని, అందుచేతనే ప్రైవేటు వ్యక్తుల చేత ఆడిటింగ్ చేయిస్తున్నారని సహకార శాఖలోని ఉద్యోగులే చెప్పుకుంటుండటం గమనార్హం.

నోటీసులు కూడా ఇచ్చాం

డీసీఎంఎస్‌లో మూడేళ్ల నుంచి మేము ఆడిటింగ్ చేయడం లేదు. ఆడిటింగ్ చేస్తామని సమాచారమిచ్చినా డీసీఎంఎస్ అధికారులు పట్టించుకోలేదు. ప్రైవేటు చార్టెడ్ అకౌంటెంట్స్‌తో ఆడిటింగ్ చేయిస్తున్నారు. ఇది చట్ట విరుద్ధం. ఇందుకు సంబంధించి షోకాజు నోటీసులు కూడా జారీ చేశాం.

\- తిరుపతయ్య,
జిల్లా సహకార ఆడిట్ అధికారి

పాలకవర్గం తీర్మానించి పంపింది

డీసీఎంఎస్‌లో ఉన్న ప్రభుత్వ షేర్ కేపిటల్‌ను చెల్లించారు. ప్రభుత్వ షేర్ కేపిటల్ లేనప్పుడు ప్రైవేటు ఆడిటర్లతో ఆడిటింగ్ చేయించుకోవచ్చు. ఈ కారణంగానే చార్టెడ్ అకౌంటెంట్ చేత ఆడిటింగ్ చేయించుకునేందుకు పాలకవర్గం తీర్మానించి ప్రభుత్వానికి పంపింది. సహకార శాఖ ఆడిటర్ల చేత ఆడిటింగ్ చేయించడంలో ఇబ్బందేమీ లేదు.

\- వెంకటస్వామి, డీసీఎంఎస్ బీఎం

జిల్లా ప్రగతికి బాధ్యతగా కృషి చేస్తా

- నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి



నెల్లూరు, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం జిల్లా ప్రగతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి తెలిపారు. పాతిక సంవత్సరాల తరువాత పార్లమెంట్‌లో నెల్లూరు జిల్లా నుంచి తెలుగుదేశం ప్రాతినిధ్య స్వరం ప్రతిధ్వనించింది. 'ప్రభాకరరెడ్డి వేమిరెడ్డి అను నేను.. లోక్‌సభ సభ్యుడిగా...' అంటూ వీపీఆర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ వేడుకను తిలకించడానికి వీపీఆర్ సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కుమారుడు అర్జున్‌రెడ్డి, కుటుంబ సభ్యులు అనిష్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకరరెడ్డి తదితరులు తరలివెళ్లారు. ప్రమాణస్వీకారం అనంతరం వీపీఆర్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు నామీద నమ్మకంతో ఈ అవకాశం కల్పించారు. నెల్లూరు ప్రజలు నన్ను పెద్ద మెజారి టీతో ఆశీర్వదించారు. వీరి నమ్మకాన్ని నిలబెట్టుకుం టా. ఇచ్చిన మాట ప్రకారం పార్లమెంట్ సెగ్మెంట్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. జిల్లా ను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం నా ప్రథమ లక్ష్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాకు కొత్త పరిశ్ర మలు తీసుకొస్తా. పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు లు పూర్తి చేయడానికి కృషి చేస్తా. కేంద్రం నుంచి జిల్లాకు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టుకొనేందుకు కృషి చేస్తా.' నని అన్నారు.

పోలీసు శాఖలో తొలి వికెట్ పడింది!

- నెల్లూరు రూరల్ డీఎస్పీ బదిలీ
- హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు



వీరాంజనేయరెడ్డి

నెల్లూరు (క్రైం), జూన్ 24 : నెల్లూరు రూరల్ డీఎస్పీ పీ వీరాంజనేయ రెడ్డి ని తక్షణమే పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరాంజనేయరెడ్డిని వెంటనే విధుల నుంచి రిలీవ్ చేయాలని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌ను ఆదేశించారు. ఈ ఆదేశాలతో వీరాంజనేయరెడ్డి రిలీవ్ కావడంతో రూరల్ ఇన్‌చార్జ్ డీఎస్పీగా నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డిని నియమించారు.

● గత ప్రభుత్వంలో ఎన్నో ఫిర్యాదులు

నెల్లూరు రూరల్ డీఎస్పీగా పి వీరాంజనేయ రెడ్డి 2022 నవంబరులో బాధ్యతలు స్వీకరించారు. ఈయన వ్యవహార శైలిపై ఆనాటి నుంచి అప్పటి ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర, జిల్లాస్థాయిలో పోలీసు అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేశారు. అప్పటి అధికార పార్టీ నాయకులు ఏది చెబితే అదే అన్నట్లుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ అధికార దుర్వినియోగం చేశారన్న అభియోగాలు ఆయనపై ఉన్నాయి. ప్రధానంగా సర్వేపల్లి, కోవూరు నియోజవర్గాల్లో అప్పటి ప్రతిపక్ష నాయకులను పోలీసులు పెట్టిన బాధలు అన్నీ ఇన్నీ కాదని, ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నిస్తే తిరిగి తమపైనే కేసులు బనాయించారని వందల సార్లు నాయకులు మీడియా ముందు మాట్లాడారు. ఇక ఇసుక, మట్టి, మద్యం, గ్రావెల్, రౌడీయిజం ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని అక్రమాలకు గతంలోని డీఎస్పీ కనుసైగల్లో పోలీసులు పనిచేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎన్నికల కోడ్ వచ్చాక కూడా అధికార పార్టీ నాయకులకు అండగా నెల్లూరు రూరల్ సబ్ డివిజన్‌లో పోలీసుల తీరు అనేక విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే. టీడీపీ నేత, ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వంటి ఎంతో మంది నాయకులు బదిలీ రూరల్ డీఎస్పీపై అనేక ఫిర్యాదులు చేశారు. చివరకు బదిలీతో జిల్లాను వీడాల్సి వచ్చింది.

వేడుకగా వెంగమాంబ గ్రామోత్సవం

- బ్రహ్మోత్సవాలకు తరలివస్తున్న భక్తులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 24 : దుత్తలూరు మండలం నర్రవాడలో శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవ, గణపతి పూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. వెంగమాంబ దంపతులను ప్రత్యేక పూలతో అలంకరించారు. అమ్మవారి గుండంలో వేలాది మంది భక్తులు కొబ్బరి వేసి తమ భక్తిని చాటుకొన్నారు. ఆలయ ఆవరణలో వివిధ దేవతామూర్తుల ప్రభలను తీర్చిదిద్దారు. రాత్రి వడ్డిపాళెంలోని వెంగమాంబ పేరంటాలు పుట్టినింటి నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవారిపాళెం మీదుగా దేవస్థానం వరకు సాగింది. ఉదయగిరి సీఐ గిరిబాబు, దుత్తలూరు ఎస్ఐ ఉమాశంకర్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

వెంగమాంబ పుట్టినిల్లయిన వడ్డిపాళెం నుంచి నర్రవాడ పుర వీధుల్లో మంగళవారం గ్రామోత్సవం జరుగుతుంది.



భవిత కేంద్రాలకు భత్యం అందేనా!?

పదేళ్లు నిండినా పసిపాపల మనస్తత్వం వారిది... ఆకలేస్తే అన్నం పెట్టమని కూడా అడగలేరు.. ఎక్కడున్నారో ఏం చేస్తున్నారో కూడా అర్థం కాని అమాయకులు. అలాంటి దివ్యాంగ చిన్నారుల, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణలో నిర్లక్ష్యం చూపడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. రవాణాభత్యం, సహాయకులకు ఇవ్వాల్సిన నగదు మూడేళ్లుగా ఇవ్వకపోవడంతోపాటు కేంద్రాలను కూడా సమీపంలోని పాఠశాలల్లోకి విలీనం చేశారు. దీంతో సరైన సౌకర్యాలు, వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

\- నెల్లూరు (వైద్యం)

- అందని పారితోషికాలు, పరికరాలు
- అంతంతమాత్రంగానే వసతులు
- ప్రత్యేకావసరాల పిల్లలకు తప్పని ఇక్కట్లు
- కొత్త ప్రభుత్వంపై తల్లిదండ్రుల గంపెడాశలు



భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు (ఫైల్)

మానసిక, శారీరక దివ్యాంగుల పిల్లలకు అవసరమై శిక్షణ అందించి, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సమగ్ర శిక్షాభియాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మండలానికి ఒక భవిత కేంద్రం ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా 38 భవిత కేంద్రాలు ఉండగా, వీటిలో 16 సొంత భవనాల్లో, మిగిలినవి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో 3,500 మంది పిల్లలు ఉండగా, వీరికి సేవలందించేందుకు 66 మంది రీసోర్స్ పర్సన్‌లు, 14 మంది ఫిజియోథెరపిస్ట్‌లు, 46 మంది ఆయాలు ఉన్నారు. మానసిక నిపుణుల అంచనా మేరకు ప్రజ్ఞలబ్ధి 70శాతం కంటే తక్కువగా ఉంటే బుద్ధి మాంద్యం పర్యవేక్షణలో భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తామని అధికారులు చెబుతున్నారు. సిబ్బంది పర్యవేక్షణలో భవితకేంద్రాల్లో విద్య, వృత్తి నైపుణ్యం, దినచర్యలు, శారీరక దృఢత్వం శిక్షణలతో పాటు ఫిజియోథెరపీ అందిస్తారు. ప్రస్తుతం ఈ కేంద్రాలు సరిగా పనిచేయకపోవడంతో విద్యార్థులంతా ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో జిల్లాలో సహిత విద్య ప్రశ్నార్థకంగా మారింది. వీరికి సరైన సేవలందకపోవడంతో తల్లిదండ్రులే ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లి థెరపీ అందిస్తున్నట్లు పలువురు తల్లిదండ్రులు తెలిపారు. భవిత కేంద్రాల్లో కూడా పిల్లల నిష్పత్తికి అనుగుణంగా సిబ్బంది కొరత ఉండడంతో వీరి సేవలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయంటున్నారు.

అందని భత్యం

భవితకేంద్రాల్లో చిన్నారులకు చెల్లించాల్సిన భత్యం నిలిచిపోయింది. ఒక్కో చిన్నారికి రవాణా భత్యం ప్రతినెలా రూ.300, ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.250 అందచేస్తారు. కొంతమంది పిల్లలు మంచానికే పరిమితమై ఎటూ కదలలేని స్థితిలో ఉంటారు. అలాంటి వారికి ఐఈఆర్టీలు ఇంటి వద్దకే వెళ్లి సేవలందిస్తారు. వీరికి అవసరమైన వసతుల కల్పక నిమిత్తం హోంబేస్డ్ అలవెన్స్ కింద నెలకు రూ.200లు, అంధులకు రూ.200 రీడర్ అలవెన్స్ అందచేస్తారు. వీటితో పాటు 6 నుంచి 8వ తరగతి చదివే ప్రత్యేక అవసరాల బాలికలకు ఉపకార వేతనం కింద రూ.200 అందిస్తారు. ఇలా ఏటా పదినెలల కాలానికి నగదు అందచేస్తారు. కానీ గత మూడేళ్ల కాలంలో నిధులు విడుదల కాకపోవడంతో, కేంద్రాల్లో నిపుణులు లేక వ్యాయామం సైతం నిలిచిపోయింది. ప్రస్తుతం కేంద్రాలు నిర్వహిస్తున్నా చిన్నారుల భత్యానికి నిధుల కొరత వెంటాడుతోంది. దీనికితోడు పూర్తిస్థాయి సేవలు అందకపోవడంతో చిన్నారుల భవితపై నీలినీడలు కమ్ముకున్నాయి.

త్వరలో పంపిణీ చేస్తాం

భవిత కేంద్రాలకు సంబంధించి ఈ విద్యాసంవత్సరానికి రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్‌లు, హోమ్‌బేస్డ్ అలవెన్స్‌ల నిధులు త్వరలోనే జమచేస్తామని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులు పరిశీలించిన అనంతరం లబ్ధిదారులకు అందచేస్తామని ఎస్ఎస్ఏ అధికారులు చెబుతున్నారు. ముమ్ముందు మరిన్ని వసతులు కల్పిస్తామని, దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత కూడా తీసుకుని సర్వే చేపడుతున్నామని వారు తెలిపారు.

సదరంపై చిన్నచూపు

మానసిక, అంగ వైకల్యంతో బాధపడే పిల్లలకు ప్రభుత్వం రూ.3వేలు పింఛను అందచేస్తున్నది. దీనికి వైద్యులు నిర్ధారించే సదరం సర్టిఫికెట్ ఉండాలి. ముందుగా పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే వైద్యులు చుట్టపక్కల కొన్ని మండలాలకు కలిపి ఓ తేదీని నిర్ధారిస్తారు. ఇందుకు కనీసం మూడు నుంచి ఆరునెలల సమయం పడుతోంది. ఈ పత్రం వచ్చేసరికి మరో రెండు నెలలు గడిచిపోతోంది. ఈ సర్టిఫికెట్ ఇచ్చే సమయానికి పిల్లలు ఆయా కేంద్రాలకు వెళ్లలేక పోతున్నారు. దీనివల్ల సదరం సర్టిఫికె ట్ రాక పిల్లలు రాయితీలకు దూరమైపోతున్నట్లు తల్లిదండ్రు లు చెబుతున్నారు.



నైరుతీ పుణ్యం..!

● సోమశిలకు 3టీఎంసీల నీరు చేరిక

అనంతసాగరం, జూన్ 24: సోమశిల డ్యాం నీరు అడుగంటి తీవ్ర సంక్షభ పరిస్థితి ఎదుర్కొంటున్న సమయంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాయలసీమలో వర్షాలు కురిశాయి. ఈ ప్రభావంతో సోమశిలకు వరద రావడంతో జిల్లాకు కాస్త ఉపసమనం లభించింది. ఈ ఏడాది జూన్ 7వరకు జలాశయానికి ఎలాంటి ఇన్‌ఫ్లో లేదు. అప్పటికి డ్యాంలో 7.272 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఆ తర్వాత కడప, కర్నూల్, అనంతపురం జిల్లాలో చెదురు ముదురుగా కురిసిన వర్షాలతో జూన్ 8నుంచి వరద రాక మొదలయ్యింది. తొలుత 521 క్యూసెక్కులు నమోదైంది. ఆ తర్వాత 1500 నుంచి 4000 క్యూసెక్కుల వరకు హెచ్చుతగ్గులుగా వరద ప్రవాహం కొనసాగింది. నేటికి తగ్గుముఖం పట్టింది. సోమవారానికి 397 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 10.070 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మొత్తంగా నైరుతి రుతుపవనాలతో 3టీఎంసీల జలాలు సోమశిలకు చేరడంతో నీటి ఇబ్బందుల నుంచి బయటపడే భరోసా వచ్చింది. తాగునీటి అవసరాల నిమిత్తం ప్రస్తుతం దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు కొనసాగుతోంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- నాలుగన్నర సవర్ల బంగారం, రూ.50 వేల నగదు అపహరణ
- వేలిముద్రలు సేకరించిన క్లూస్‌టీం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

కావలి రూరల్, జూన్ 24: పట్టణంలోని అరటితోట ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. నాలుగన్నర సవర్ల బంగారు నగలు రూ.50 వేల నగదును దుండగులు అపహరించుకుపోయారు. ఈ విషయాన్ని సోమవారం గుర్తించిన పనిమనిషి స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారమిచ్చారు. ఒకటవ పట్టణ పోలీసుల కథనం మేరకు, అరటితోట ప్రాంతంలో నివాసముంటున్న గౌతమ్‌క్రిష్ణ, భానుస్వేత దంపతులు ఉద్యోగరీత్యా నాలుగు నెలల క్రితం యూకే వెళ్లారు. ఇంట్లో ఉండే గౌతమ్‌క్రిష్ణ తల్లి సుజాత గత నెల 18న ఇంటికి తాళం వేసి విజయవాడలో ఉంటున్న కుమార్తె ఉషశ్రీ వద్దకు వెళ్లింది. చెట్లకు నీళ్లు పట్టేందుకు రోజూలాగే ఇంటికి వచ్చే పనిమనిషి సోమవారం ఉదయం కూడా వచ్చింది. తలుపు వద్ద స్రూలు పడి ఉండటంతోపాటు తలుపు దెబ్బతిని ఉండటంతో స్థానికులకు సమాచారమిచ్చింది. వారి వచ్చి పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుల బంధువుల ఫిర్యాదుతో డీఎస్పీ వెంకటరమణ, సీఐ రాజేష్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటి తలుపులు పగలగొట్టి ప్రవేశించిన దుండగులు బీరువాను కింద పడేసి తాళం పగలగొట్టారు. అందులోని వస్తువులను చిందరవందరగా పడేశారు. బీరువాలో ఉన్న ఐదు జతల పెద్ద కమ్మలు, ఆరుజతల చిన్న కమ్మలు, బంగారు అడ్డిగను చోరీ చేశారు. సుమారు నాలుగన్నర సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. అంతేకాక రూ. 50 వేల నగదును కూడా అపహరించుకుపోయారు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. కాగా గౌతమ్ క్రిష్ణ మామ శనివారం ఉదయం ఇంటికి వచ్చి అక్కడే తన బైక్‌ను ఉంచి వెళ్లారు. అప్పటికీ అంతా బాగానే ఉంది. అయితే ఆదివారం అర్ధరాత్రి తరువాత చోరీ జరిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేష్ తెలిపారు.



దుండగులు చిందరవందర చేసిన బీరువా, దుస్తులు

ఉదయగిరి బీసీ కాలనీలో దొంగతనం

● ఇంట్లోని 30తులాల బంగారం, రూ.15వేల నగదు కాజేత

ఉదయగిరి, జూన్, 24: స్థానిక బీసీకాలనీకి చెందిన షేక్ ఖాసింపీరా, జైనాబీలు దంపతుల ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరికి కుమార్తె ఉంది. ఆమె స్థానిక సినిమాహాల్ సెంటర్‌లో నివసిస్తోంది. ఆమె జ్వరంతో స్థానిక ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు రాత్రి పది గంటలకు వెళ్లారు. చికిత్స అనంతరం ఆమెను ఇంటికి తీసుకెళ్లే క్రమంలో వర్షం రావడంతో బార్యాభర్తలిద్దరూ కుమార్తె ఇంట్లోనే నిద్రించారు. సోమవారం తెల్లవారుజామున వారు బీసీ కాలనీలోని ఇంటికి వెళ్లేసరికి తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూస్తే ఇంట్లోని రెండు బీరువాలను పగలగొట్టి 30 తులాల బంగారు అభరణాలు, రూ.15వేల నగదును తీసుకెళ్లినట్లు నిర్ధారించుకున్నారు. మరికొన్ని రోజుల్లో ఆ ఇంట్లో శుభకార్యానికి అవసరమైన బంగారం, నగదు ఉంచినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ గిరిబాబు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



దుండగులు పగలగొట్టిన బీరువా

అయ్యా.. మా సమస్యలు పరిష్కరించండి !

● పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రారంభం

నెల్లూరు(క్రైం), జూన్ 24 : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత నిలిచిన ఎస్పీ గ్రీవెన్స్ ఎన్నికల ఫలితాల తర్వాత సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికగా ప్రారంభమైంది. పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 102 మంది వినతులు అందజేశారు. ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ ఆ వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇకపై ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని తెలిపారు. ప్రజల సమస్యలు నిర్ణీత గడుదులోగా పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.



చిట్టీలు వేసిన మహిళలు

రైస్‌మిల్లు యజమానిపై చర్యలు తీసుకోండి

తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారుల ద్వారా నవాబుపేటలోని ఓ రైస్‌మిల్లు యజమానికి విక్రయిస్తే అతను నగదు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని ఓజిలి, అనంతసాగరం, ఆత్మకూరు తదితర ప్రాంతాలకు చెందిన రైతులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నవాబుపేటకు చెందిన రైసు మిల్లు యజమాని రైతులకు రూ.5,66,70,000 చెల్లించాల్సి ఉందని, నగదు ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడని తెలిపారు. వెంటనే నగదు ఇప్పించేలా చర్యలు తీసుకోవా లని కోరారు.

సంతపేట పోలీసులు పట్టించుకోవడం లేదు

నగరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన లీలామోహన్, వాసంతి దంపతులు ఎన్నో ఏళ్లుగా ప్రొవిజెన్స్ దుకాణం, బియ్యం వ్యాపారం చేస్తూ అందరితో నమ్మకంగా ఉండేవారని, వారిని నమ్మి 50 మంది నెలవారీ చిట్టీలు వేశామని ఆ ప్రాంత మహిళలు ఫిర్యాదు చేశారు. చిట్టీల కాలపరిమితి దాటినా నగదు చెల్లించకుండా కాలయాపన చేశారన్నారు. ఇటీవల రాత్రికి రాత్రే ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయారన్నారు. చిట్టీలు వేసిన వారికి రూ.కోటి వరకు చెల్లించాల్సి ఉందని, వారి మోసంపై సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు పట్టించుకోవడం లేదని, మీరే న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

శాంతిభద్రతలు కాపాడండి : వైసీపీ

ప్రశాంత జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా టీడీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారని వైసీపీ నాయకులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. శాంతిభద్రతలు కాపాడాలని కోరారు. అనంతరం మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయన్నారు. పోలీసులు వైసీపీ నాయకులు, కార్యకర్తలపైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్పీ సానుకూలంగా స్పందించారని, విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	138
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	274
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6816
వెండి కిలో ధర	రూ. 91,300
వెండి ఒక గ్రాము	రూ. 93.30

చెత్త నుంచి సంపద తయారీ

మళ్లీ మొదలయ్యేనా!?



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

గ్రామాల్లో పేరుకున్న చెత్త నుంచి సంపదను తయారు చేసేలా గత టీడీపీ హయాంలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇవి నిర్వీర్యమయ్యాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని 46 మండలాల్లో ఈ కేంద్రాలు దిష్టిబొమ్మల్లా మారాయి. పంచాయతీ నిర్వహణలో అధికారులు, సిబ్బంది పారిశుధ్యంపైనే దృష్టి సారించడం తప్ప ఇలాంటి ప్రత్యేక పథకాలపై ఆసక్తిని కనపరచలేక పోవడం కూడా ఇవి నిర్వీర్యమయ్యేందుకు మరో కారణంగా చెప్పవచ్చు.

- పంచాయతీలకు ఆదాయం సమకూరేనా..?
- ప్రతిష్ఠాత్మక పథకం నీరుగారిన వైనం
- టీడీపీ ప్రభుత్వంలో పూర్వవైభవం వచ్చేనా...!?

అల్లూరు, జూన్ 24: ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం 2014లో ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టింది. అందుకు అనుగుణంగా రూ.లక్షల్లో నిధులు మంజూరు చేసింది. విడతల వారీగా మంజూరు చేసినా ఒక్కొక్క కేంద్రానికి రూ.13 లక్షల వంతున వచ్చాయి. ఈ క్రమంలో జిల్లాలోని మొత్తం కేంద్రాలకు రూ.4.5 కోట్లు పైబడి నిధులను మంజూరు చేసి వీటిని కొనసాగించారు. అప్పట్లో ఈ కేంద్రాలను యుద్ధప్రాతిపదిక ఏర్పాటు చేశారు. అయితే ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసిన నిధులు ఈ కేంద్రాల నిర్వహణా లోపంతో వృథా అయ్యాయి.

● పంచాయతీలకు ఆదాయం సమకూరేనా?

సంపద తయారీ కేంద్రాల నిర్వహణ గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైంది. పంచాయతీకి ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాలనే అప్పటి ప్రభుత్వ ఆశయాలకు నీళ్లొదిలారు. పంచాయతీ ఆదాయంలో భాగస్వామ్యం చేయాలనే సదుద్దేశంతో చేపట్టిన ఈ కేంద్రాలు క్షేత్రస్థాయిలో సంపూర్ణంగా నిర్వహణకు నోచుకోక 85 శాతం శిథిలావస్థకు చేరుకున్నాయి. నిర్వహణే కష్టతరంగా మారితే ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది. ఇలా చూసుకుంటే పంచాయతీల ఆదాయంలో భాగస్వామ్యమయ్యే పరిస్థితి ఎక్కడి నుంచి వస్తుందంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

● ఏర్పాటుకు ఎన్నో సమస్యలు

ఈ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా డంపింగ్ యార్డు కోసం స్థల సేకరణపై కొన్నచోట్ల అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఆలస్యం అయ్యాయి. కొన్నిచోట్ల పంచాయతీ స్థలాలను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకోవడంతోపాటు వివాదాలు కూడా తలెత్తాయి. ఈ పరిస్థితులను అధిగమించి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఎంతో శ్రమించారు. అన్నింటినీ అధిగమించి చేపట్టిన కేంద్రాల నిర్వహణకు గత ప్రభుత్వ గాలికి వదిలేసింది. ప్రభుత్వ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోనైనా మంచి రోజులు రాకపోతాయా..? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఆశయం గొప్పదే...



చెత్త నుంచి సంపద తయారీ ఆలోచన ఆశయం గొప్పదే. గత వైసీఈపీ ప్రభుత్వ అలసత్వంతోనే ఇవి నిర్వీర్యమయ్యాయి. ఒక ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు మరో ప్రభుత్వంలో కొనసాగకూడదనే గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో ఈ కార్యక్రమం కూడా బలైపోయింది. మళ్లీ వీటిని పనిచేయంచేలా చర్యలు తీసుకోవాలి.

- సయ్యద్ అయూబ్, అల్లూరు

వ్యవస్థల నిర్వీర్యం



చెత్త నుంచి ఎరువుల తయారీ బృహత్తర కార్యమే. ఇలాంటి ఆలోచన గత ప్రభుత్వంలో లేకుండా పోయింది. ఉన్న వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే పరిపాటిగా మారింది. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఈ కేంద్రాలకు పూర్వ వైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- రాయి నాయుడు, ఇస్కపల్లి, అల్లూరు మండలం

రైతులకు ఎంతో మేలు



వర్మీకంపోస్టు ఎరువులు రైతులకు ఎంతో మేలు చేకూర్చుతాయి. జిల్లాలో డెల్టా ప్రాంతం అత్యధికంగా ఉండడంతో భూములకు ఉపయోగకరం. సంపద తయారీ కేంద్రాల ద్వారా ఉత్పత్తి అయ్యే కంపోస్టు ఎరువులకు భారీ గిరాకీ ఉంటుంది. తద్వారా సంపద తయారీ కేంద్రాలకు మనుగడ లభిస్తుంది.

- బాలకృష్ణ, పడమర గోగులపల్లి, అల్లూరు మండలం

గ్రామాల్లో పేరుకుపోయే చెత్తను దూరప్రాంతంలో పారేసి, దాన్ని ధ్వంసం చేసే కార్యక్రమానికి భిన్నంగా దీని నుంచి ఎలాంటి లాభాలు పొందగలమో అనే ఆలోచనతోనే ఈ పథకం వెలుగుచూసింది. పనికిరాని చెత్త నుంచి తడిచెత్త పొడి చెత్త అనే రెండు భాగాలుగా విభజించడంతోపాటు ప్లాస్టిక్, ఇనుము, గాజు తదితర వస్తువులను వేరు చేయడం ముఖ్య ఉద్దేశం. వీటిలో అవసరమైన వాటితో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయడం, అసలు దేనికీ పనికిరాని వాటిని పూర్తిగా ధ్వంసం చేయడమే ఈ పథకం లక్ష్యం. గ్రామంలోని ప్రతి 1000 మంది జనాభాకు ఒక వ్యక్తిని కేటాయించడం, ప్రతి ఇంటికి తడిచెత్త పొడిచెత్తలను వేసేందుకు రెండు బుట్టలు ఇవ్వడం కీలకంగా నిర్వర్తించాల్సిన కార్యక్రమాలు. ఇంత పకడ్బందీగా చేపట్టిన కార్యక్రమానికి పూర్వ వైభవం వచ్చేనా ? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పూర్వ వైభవం వచ్చేనా..?



వర్మీ కంపోస్టు ఎరువు తొట్టె (ఫైల్)

గుళికలు తిని గర్భిణి మృతి

మనుబోలు, జూన్ 24: మండలంలోని గొట్లపాళెం గిరిజనకాలనీలో ఎల్లంపల్లి రమాదేవి (22) సోమవారం గుళికలు తిని మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఐదు సంవత్సరాల క్రితం మిట్టాత్మకూరుకు చెందిన రమాదేవిని గొట్లపాళెంకు చెందిన ఎల్లంపల్లి ఏడుకొండలు రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం రమాదేవి నిండు గర్భిణి. రెండు, మూడు రోజుల్లో ప్రసవం కానుంది. కొద్దిరోజులుగా ఏడుకొండలు పనికివెళ్లడం లేదు. పనికి వెళ్లకపోతే కుటుంబం ఎలా జరగాలి అంటూ రమాదేవి భర్తతో గొడవపడింది. పనికి వెళ్లకపోతే గుళికలు తినేస్తానని బెదిరించింది. భర్తను భయపెట్టేందుకు నిజంగానే గుళికలు తిని భర్తకు వచ్చి చెప్పింది. దానిని ఏడుకొండలు తమాషాగా తీసుకున్నాడు. కొద్దిసేపటి తరువాత రమాదేవి పడిపోయి నోట్లో నుంచి నురుగు రావడంతో హుటాహుటిన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ రమాదేవి చికిత్స పొందుతూ మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్ఐ అజయ్‌కుమార్ నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి

కావలి రూరల్, జూన్ 24: పట్టణంలోని కోపరేటివ్ కాలనీకి చెందిన మౌనికపై బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన రాజేష్ కుమార్ రోకలిబండతో దాడి చేసి గాయపరిచాడు. ఈ మేరకు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు, మౌనిక భర్త మూడేళ్లక్రితం మృతి చెందటంతో రాజేష్‌కుమార్‌తో ఆమె సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మద్యం తాగి ఆమె ఇంటికి వచ్చి గొడవపడ్డారు. ఈ క్రమంలో రాజేష్‌కుమార్ రోకలి బండతో మౌనికను తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితురాలు కేకలు వేయడంతో బాధితురాలి తల్లి ఆమెను వైద్యశాలకు తీసుకువెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ ఎస్ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘ఉపాధి’లో అవినీతి లెక్క తేలింది!

● చిన్నగోపవరంలో రూ.25 లక్షల స్వాహా

కలువాయి, జూన్ 24 : వైసీపీ పాలనలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతి బట్టబయలైంది. మండలంలోని చిన్నగోపవరం పంచాయతీలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.24.5 లక్షలు అవినీతి జరిగినట్లు అధికారులు లెక్క తేల్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరులకు చెందిన 134 జాబ్‌కార్డులలో గ్రామానికి సంబంధంలేని ఇతర ప్రాంతాల వారి పేర్లు చేర్పించి, వారంతా ఉపాధి పనులకు వెళుతున్నట్లు బోగస్ మస్టర్లు వేసి నిధులు స్వాహ చేశారు. దీంతో డ్వామా అంబుడ్స్ పర్సన్ వెంకటరెడ్డి సోమవారం మరోసారి గ్రామంలో విచారించారు. ముందుగా కలువాయి ఎంపీడీవో కార్యాలయంలో ఆయన పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చిన్నగోపవరానికి వెళ్లి జరిగిన పనులను పరిశీలించారు. అక్కడ గ్రామస్థులతో విచారించి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. కాగా, ఉపాధి హామీ పనుల్లో భారీగా అవినీతి చోటు చేసుకుందని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో ఈ ఏడాది మార్చి 28న విచారించడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఈ అవినీతి వ్యవహారంపై ఏప్రిల్ 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో ఓ కథనం ప్రచురితమైంది. ఎన్నికల అనంతరం ఈ వ్యవహారంపై ఈ నెల 8వతేదీన చిన్నగోపవరం క్షేత్ర సహాయకుడు అదిరెడ్డి మహేంద్రరెడ్డిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. తాజాగా రూ.24.5 లక్షల అవినీతి జరిగినట్లు లెక్క తేల్చారు. ఈ అవినీతి వ్యవహారంలో సంబంధం ఉన్న ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు దిగమింగిన నిధులను రికవరీ చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



కూలీలను విచారిస్తున్న అంబుడ్స్ పర్సన్ వెంకటరెడ్డి

నేటినుంచి వీఎస్‌యూలో పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు

వెంకటాచలం, జూన్ 24 : ఏపీఆర్ సెట్ 2023-24 ఏడాదికిగాను పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు విక్రమ సింహపురి యూనివర్సిటీలో మంగళవారం నుండి ఈనెల 27వ తేదీ వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఏపీఆర్ సెట్ ఇంటర్వ్యూ కోఆర్డినేటర్ డాక్టర్ హనుమారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న సోషల్‌వర్క్, 26, 27 తేదీల్లో టూరిజం మేనేజిమెంట్, బయోటెక్నాలజీ, అప్లైడ్‌సైన్స్ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పైన తెలిపిన సబ్జెక్టుల్లో క్వాలిఫై అయిన అభ్యర్థులు విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

వీఆర్‌సీని సందర్శించిన ఎన్‌సీఆర్టీ బృందం

నెల్లూరు(విద్య), జూన్ 24 : జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్‌సీఆర్టీ) బృందం అధికారులు సోమవారం నెల్లూరులోని వీఆర్ కళాశాలను పరిశీలించారు. వెంకటాచలం మండలంలోని చవటపాళెంలో ఏర్పాటు చేయనున్న ఎన్‌సీఈఆర్టీ ప్రాంతీయ కేంద్ర కార్యాలయాలకు సంబంధించి పరిశీలనకు వారు జిల్లాలో పర్యటించారు. ప్రాంతీయ కేంద్రం భవన నిర్మాణాలు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా వీఆర్ కళాశాలలో కార్యకలాపాలు నిర్వహించేందుకు భవనాలను పరిశీలించారు. అందులో 25 తరగతి గదులను తీసుకోవడంతోపాటు విద్యార్థుల వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

దళితులకు న్యాయం చేయండి!

- తహసీల్దారును కోరిన ఎమ్మార్పీఎస్ నాయకులు
- స్థల ధ్రువీకరణపత్రంలో రాజముద్ర నకిలీదని వెలుగులోకి..

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 24 : ఓ భూమి విషయంలో బాధిత దళితులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దారు సురేష్‌బాబును కోరారు. ఇందుకు సంబంధించి సదరు భూమి ధ్రువీకరణపత్రంలోని రాజముద్ర నకిలీదని అధికారులు తేల్చారు. దీంతో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. తహసీల్దారు, ఎమ్మార్పీఎస్ నాయకులు, బాధితుల కథనం మేరకు.. నగర పంచాయతీలోని ఇస్కపాళెం, అరుంధతివాడలో కొంత స్థలం పర్రి వెంకయ్య, వెంకమ్మ దంపతుల అనుభవంలో ఉన్నట్టు 2022లో వెంకమ్మ పేరుతో తహసీల్దారు రాజముద్ర వేసి ధ్రువీకరణపత్రం ఇచ్చినట్టు, దాని ఆధారంగా సదరు భూమిని తమ కుమారుడు పర్రి శ్రీనివాసులుకు ఈ ఏడాది జనవరి 24న రిజిస్ట్రేషన్ చేసిఉంది. ఇటీవల ఆ స్థలంలో రిజిస్ట్రేషన్‌దారులు తిరుగుతూ తమదంటూ ప్రచారం చేయగా అరుంధతీయులు అప్రమత్తమై స్థలం చుట్టూ రాళ్లు నాటారు. దీంతో పర్రి శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ పిలిపించి విచారించారు. ఆ తరువాత శ్రీనివాసులు కోర్టులో కేసువేసి ఆరుగురికి నోటీసులు పంపించారని బాధిత అరుంధతీయులు వాపోయారు. దీంతో సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా నేత బెల్లంకొండ గోపీ మాదిగతోపాటు పలువురు నాయకులు, బాధిత అరుంధతీయులు తహసీల్దారును కలిసి న్యాయం కోరారు. దీంతో రెవెన్యూ అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించగా, అందులోని రాజముద్రలు నకిలీవని తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు ఆనంద్ గుర్తించారు. ఈ మేరకు వారు ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లతో విచారణకు ఆదేశించారు. కాగా నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దారును కోరారు.



తహసీల్దారుతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, బాధితులు

ఆగని ఇసుక అక్రమ దందా!

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని యంత్రాంగం

సంగం, జూన్ 24: మక్తాపురం వైసీపీ నాయకుల ఇసుక అక్రమ దందా ఆగడం లేదు. రాత్రి పగలు తేడా లేకుండా కొనసాగుతోంది. ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగం మామూళ్ల మ త్తులో తూగుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మక్తాపురం నాయకులు పక్కనే ఉన్న పెన్నానది నుంచి ఇసుక దందా చేసుకుంటూ జేబులు నింపుకున్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చినా వారి దందా ఆగడం లేదు. ఈ ఇసుక దందాపై స్థానిక టీడీపీ నాయకులు రెవెన్యూ, పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వీరు ఇసుకే కాకుండా పెన్నా పొర్లుకట్టల మట్టిని కొల్లగొట్టడంతో వరదలు వచ్చినప్పుడు గ్రామానికి ముప్పు ఏర్పడుతుంది. వారంరోజుల కిందట దారికి గండి కొట్టించినా వారు గండిని పూడ్చి వేసి యథావిధిగా ఇసుక, మట్టి దందాకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి తీసుకెళ్లినట్లు స్థానిక టీడీపీ నాయకులు విశ్వసనీయ సమాచారం.



పెన్నానది పొర్లుకట్ట మట్టి తరలించకుండా దారికి అడ్డంగా తవ్విన కందకం



పెన్నానదిలోకి ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్న దారి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా

ఆత్మకూరు, జూన్ 24: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో డయేరియాతో పాటు ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లా సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, ఆశావర్కర్లు, ఐసీడీఎస్, మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అన్నిప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ప్రతి మంగళవారం పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడంతో పాటు, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అందుకు ప్రతి సచివాలయం పరిధిలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశామన్నారు. మురుగుగుంటల్లో ఆయిల్‌బాల్స్ మేయడం, మలాథిన్ స్ప్రే చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లించాలని తెలిపారు. ఇళ్ల మధ్యలో మురుగునీరు నిల్వ లేకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆత్మకూరు అర్బన్ ప్రభు త్వ వైద్యశాల వైద్యాధికారి అస్మా, ఐసీపీఎస్ సీడీ పీవో సునీలత, ఏఈలు జూపల్లి ప్రసాద్, వరలక్ష్మి పాల్గొన్నారు.



ఉదయగిరి రూరల్: అవగాహన కల్పిస్తున్న బృంద సభ్యులు

ఉదయగిరి రూరల్: గండిపాళెంలో సచివాలయ, వైద్యఆరోగ్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులు, డయేరియాపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తొట్లు, టైర్లలో ఉన్న నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ప్రతిశుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఏ చిన్నపాటి రుగ్మతకు గురైనా అలసత్వం చేయక వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్పన, కార్యదర్శి జీ.అమర్‌నాథ్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వరికుంటపాడులో మాట్లాడుతున్న ఎమ్పీడీవో వెంకటకృష్ణకుమారి

వరికుంటపాడు: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల దృష్ట్యా వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టి వ్యాధుల వ్యాప్తికి ఎలాంటి అవకాశం లేకుండా చూడాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు నెలల పాటు నిరంతరాయంగా కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖరరాజు, కార్యదర్శులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి



తరగతి గదిలో ఐఎఫ్‌ఈ బోర్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్

సంగం, జూన్ 24: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పూర్తి చేయాలని డిప్యూటీ డీఈవో గోపాల్ ఆదేశించారు. సోమవారం ఆయన అన్నారెడ్డిపాళెం జిల్లా ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. నత్తనడకన జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతులపై హెచ్‌ఎం లక్ష్మీదేవితో మాట్లాడారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి ప్రభుత్వం సరఫరా చేసిన ఐఎఫ్‌ఈ బోర్డులను వినియోగిస్తున్నారో లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమై విద్య, భోజనం అందచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో జానికీరామ్, మల్లయ్య పాల్గొన్నారు.

ఉచితంగా భూసార పరీక్షలు



మర్రిపాడు: మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

మర్రిపాడు, జూన్ 24: ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన మర్రిపాడు రైతుల పొలాలల్లో మట్టి నమూనాలు సేకరించి మాట్లాడారు. ఇప్పటికే మండలంలో 329మట్టి నమూనాలను నెల్లూరు భూసార పరీక్ష కేంద్రానికి పంపామన్నారు. ఈ పరీక్షలతో పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకొని, అందుకు అనువుగా మందులు ఉపయోగించుకో వచ్చన్నారు. నిస్సార మైన పంటల సాగుకు ఈ పరీక్షలు చాలా అవసరమని, ప్రతిరైతు ఈ అవకాశాన్ని ఉపయోగిం చుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యసాయ విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, లహరి, పవన్, రైతులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ఆత్మకూరు, జూన్ 24: స్థానిక ఆది ఆంధ్ర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ప్రణీత్ రూ.20 వేల విలువ చేసే విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు లక్కు కృష్ణప్రసాద్, ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర, డాక్టర్ కుమార్, తోడేడి అశోక్, పాఠశాల అభివృద్ధి కమిటీ, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఎం.నాగేంద్ర, పరిమళ, గాయత్రి, పూర్వ విద్యార్థులు వేము శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

వరికుంటపాడు, జూన్ 24: నార్తొండాయపాళెం పంచాయతీ కార్యదర్శిగా శివకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఏడాదికిపైగా విరువూరు కార్యదర్శి విష్ణు ఇన్‌చార్జీగా పనిచేశారు. విడవలూరు నుంచి బదిలీపై వచ్చిన శివకుమార్ రెగ్యులర్ కార్యదర్శి గా నియమించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బైకు ర్యాలీని జయప్రదం చేయండి

వింజమూరు, జూన్ 24: శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి మంగళవారం నియోజకవర్గానికి వస్తున్న కాకర్ల సురేష్‌కు కూటమి నాయకులు ఘన స్వాగతం పల కనున్నట్లు అందులో భాగంగా బైక్, వాహన ర్యాలీ నిర్వ హించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని తె పార్టీ కార్యాలయంలో ఈ విషయంపై ఆయన మాట్లాడారు. జలదంకి మండలం జమ్మలపాలెం నుంచి వింజమూరు మండలంలోని బొమ్మరాజు దగ్గర పార్టీ కార్యాలయం వరకు నిర్వహించే ఈ ర్యాలీని జయప్రదం చేయాలని నాయకులను పిలపునిచ్చారు. మధ్యాహ్నం 3గంటల నుంచి ఈ ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఆత్మకూరు, జూన్ 24: ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానిక చర్యలు చేడతామని ఇన్‌చార్జ్ ఆర్డీవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు 9మంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు ఇచ్చారు. కార్యక్రమానికి పలు శాఖల అధికారుల గైర్హాజరయ్యారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో ప్రేమ్‌కుమార్

సంగం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రమాదేవి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సమస్యల పరిష్కా ర వేదిక (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెస్సల్ సిస్టం) పేరుతో నిర్వహించాలని టీడీపీ ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధింత అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.




సంగం: అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దారు రమాదేవి


ఉదయగిరి: స్థానిక మండల రెవె న్యూ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యక్రమాన్ని తహసీల్దారు నెహ్రూబాబు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకవస్తే సత్వరమే సమస్యలను పరిష్కరిం చేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

పురుషామృగ వాహనంపై కోటేశ్వరస్వామి

సంగం, జూన్ 24: దువ్వూరు గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆదివారం అర్ధరాత్రి పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వేదపండితులు మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో పూజారి చదలవాడ శివకుమార్ చార్యులు గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పురుషామృగ వాహనంపై స్వామివారు



శ్రీకృష్ణుడి వేషధారణలో ఆత్మారాముడు

కుంకుమార్చన పూజలు

ఉదయగిరి: గంగిరెడ్డిపల్లి అనంతపూరి గంగాభవానికి మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి కాయాకర్పూరం, కుంకుమ తీసుకొని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొన్నారు. ఆలయం వద్ద అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఎలక్ట్రికల్ ప్రభపై గ్రామోత్సవం చేపట్టగా సిరి ఈవెంట్స్ చెక్కభజన చేపట్టారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు చంద్ర మధుసూదన్‌రావు, మన్నేటి శ్రీనివాసులరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, గంగాధర్, పాపిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

శ్రీకృష్ణుడి వేషధారణలో..

సంగం: అన్నారెడ్డిపాళెం సీతా లక్ష్మణ సమేత ఆత్మారామస్వామి ఆదివారం అర్ధరాత్రి పొన్నమానుపై శ్రీకృష్ణుడి వేషధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నిర్వ హించిన గ్రామోత్సవంలో భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి వేదగిరి సత్యనారాయణచార్యాలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన కంచె తొలగింపు

మర్రిపాడు, జూన్ 24: మండలంలో అక్రమార్కులు ప్రభుత్వ భూముల ఆక్రమణలతో పెట్రేగిపోతుండటంతో తహసీల్దారు సీతారత్నం సోమవారం ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. వైసీపీ మహిళా నాయకురాలు ఇటీవల ఏకంగా తహసీల్దారు కార్యాలయానికి సంబంధించిన సర్వే నెంబర్ 427లో ఎకరా భూమిని ఆక్రమించి, ఆ భూమి చుట్టూ ఇనుప కంచె వేశారు. దాన్ని సోమవారం పోలీసుల సమక్షంలో పరిశీలించి తొలగింప జేశారు. ఆ భూమి ఇప్పటినుంచి రెవెన్యూ అధికారుల స్వాధీనంలో ఉంటుందన్నారు.



విద్యార్థినికి ఆర్థికసాయం

ఉదయగిరి రూరల్, జూన్ 24: గండిపాళెం మెడబలిపి తిరుపతయ్య కుమార్తె భూమిక విద్యాభ్యాసానికి గ్రామానికి చెందిన జీఎంకే ట్రస్టు అధినేత, మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.20వేలను సోమవారం ట్రస్టు ప్రతినిధులతో కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు బీ.వెంకటేశ్వర్లు, రాపల్లి తిరుపతి పాల్గొన్నారు.

చలో వరంగల్‌ను జయప్రదం చేయండి

ఉదయగిరి రూరల్, జూన్ 24: వచ్చేనెల 7వ తేదీన జరుగనున్న చలో వరంగల్ మాదిగల ఆత్మగౌరవ కవాతు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీ ఎస్ జాతీయ, రాష్ట్ర నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, బకీరు జాషువా మాదిగలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏటీఎం కాంపౌండ్‌లో ఎమ్మార్పీ ఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమైయ్యారు. ఇప్పటికే గ్రామ కమిటీలను పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి మోహన్, బెజవాడ బాలగురవయ్య, గంగపట్ల సింహాద్రి, కిరణ్, అర్జున్, విజయ్, రవి పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' పై అవగాహన

వరికుంటపాడు, జూన్ 24: గ్రామాల్లో డ్రాపౌట్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తెలిపారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో 'నేను బడికి పోతా' అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు అరుణాదేవి, ఎంఈవోలు షావుద్దీన్, రమ ణయ్య, కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

మర్రిపాడు, జూన్ 24: యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మోహన్‌ప్రసాద్ సోమవారం ఆయన మండలంలోని పాఠశాలలను సందర్శిస్తూ ఉపాధ్యాయులతో సంఘం సభ్యత్వ నమోదును చేయించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరి: గంగిరెడ్డిపల్లి, వెంకట్రావుపల్లి పాఠశాలల్లో యూటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎడమ తిరుపతయ్య, గాజులపల్లి సుబ్బారెడ్డి, ఫణిరాజ్, మున్నా, సారధి, రామాంజనేయులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కావలి,జూన్24: పట్టణంలో జ్వరాలు, మలేరియా, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సచివాలయ శానిటేషన్, ఇమ్యునిటీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడా చెత్తా చెదారం నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా పూడిక తీయాలని ఆదేశించారు. ఎక్కడా గుంటలు, మంచినీటి పైప్‌లైన్ల వాల్వ్‌ల గుంటల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు సమావేశంలో మున్సిపల్ డీఈ సాయిరామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కావలి రూరల్ : నీటి ద్వారా సంక్రమించే డయేరియా వ్యాధి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఐ. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కావలి మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీధర్ అధ్యక్షతన సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఈ మాట్లాడుతూ గ్రామాల్లోని వాటర్ ట్యాంకులు 15 రోజులకు ఒక్కసారి శుభ్రపరచాలన్నారు. పైప్ లైన్లు ఎక్కడా లీక్‌లు కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ క్రిష్ణచైతన్య, తుమ్మలపెంట వైద్యాధికారి అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



కావలి : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్



లింగసముద్రం : ప్రసంగిస్తున్న ఎంపీడీవో శేషుబాబు

లింగసముద్రం : మండలంలోని అన్ని గ్రామాల్లో డయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో యు శేషుబాబు తెలిపారు. సోమవారం లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీ రమేష్, సీహెచ్‌వో జీ శ్రీనివాసులు, ఏఈ సాగర్, ఎంఈవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారువేటలో వరదరాజస్వామి



అశ్వవాహనంపై వరదరాజస్వామి

అల్లూరు : మండలంలోని నార్తుమోపూరు వరదరాజస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పారువేట నిర్వహించారు. స్వామివారిని అశ్వవాహనంపై అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి



లోకేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఇంటూరి

కందుకూరు, జూన్ 24: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఉదయం లోకేష్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించగా సాయంత్రం నాగేశ్వరరావు అమరావతికి వెళ్లి లోకేష్ చాంబర్‌లో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందచేశారు.

10 మంది పాఠశాలలో చేరిక

కొండాపురం : నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్రబాలెం గ్రామ ఎస్టీకాలనీలో బడి ఈడు పిల్లలు 10 మందిని విద్యాశాఖ అధికారులు సోమవారం పాఠశాలలో చేర్పించారు. గ్రామంలో పాఠశాల మూతపడడంతో సమీప భీమవరప్పాడు ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సాయిపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం ఐ.బాలక్రిష్ణయ్య, గ్రామస్థులు కొమ్మి ప్రభాకర్, ఉపాధ్యాయులు వెంకటరావు, భీమవరప్పాడు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వి.మాధవ, ఉపాధ్యాయుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు 'నేను బడికి పోతా' అనేలా సహకరించాలి

అల్లూరు : నేను బడికి పోతా.. అంటూ ప్రతి చిన్నారి అనేలా తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈవో రవీంద్రనాథ్ అన్నారు. పట్టణ పరిధిలోని రామాపురం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో వై.శాంతకుమారి పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు



వలేటివారిపాలెం, జూన్ 24 : మండలంలోని బడేవారిపాలెం గ్రామ సమీపంలో సోమవారం మధ్యాహ్నం పేకాట శిబిరంపై ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ 80,570 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా స్వర్ణలత, సలీంబేగ్

కావలిటౌన్ : రోటరీ క్లబ్ కావలిశాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా సోమశిల స్వర్ణలత, మొగల్ సలీంబేగ్‌లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెంగళరావునగర్‌లోని రోటరీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి రోటరీ క్లబ్ జిల్లా బాధ్యులు డాక్టర్ మాధవరెడ్డి అధ్యక్షత వహించారు. నూతన కమిటీ నియామక అధికారిగా పాల్గొన్న పీ కేశవ్‌రెడ్డి నేతృత్వంలో అధ్యక్ష, కార్యదర్శులు, డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా రోటరీ ప్రముఖులు భర త్‌కుమార్ రెడ్డి, బీ సురేంద్ర రెడ్డి,కే మునిగిరీష్, వీ నాగస తీష్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సఫ్దార్ కిర్మాణీ, దినేష్, వెంకటసుబ్బయ్య, జయచంద్రానాయుడు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పేరు పెట్టడం హర్షనీయం

కందుకూరు : విదేశీ విద్యాపథకానికి అంబేడ్కర్ విదేశీ విద్యగా పేరుమారుస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవటం హర్షనీయమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజంలో దళితులు ఆత్మగౌరవంతో తలెత్తుకుని తిరిగేలా చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

జలదంకిలో పారిశుధ్య పనులు

జలదంకి : స్థానిక గ్రామ పంచాయతీలో ఉపసర్పంచి కూరపాటి మాలకొండారెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. మొదటిరోజు పెద్దచెరువు కట్టకింద ఉన్న చెత్తను తొలగించారు. సోమవారం డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు.

మందాటి చెరువులో ఆక్రమణలు తొలగించాలని ధర్నా

కావలి,జూన్24: మందాటి చెరువు ఆక్రమణలను తొలగించి, చెరువును కాపాడాలని మందాటి చెరువు పరిరక్షణ సమితి నాయకుడు, కనుమూరు భాస్కర్‌రెడ్డి, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి కోరారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద వారు ధర్నా చేసి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ ముసునూరు, మందాటి చెరువుల లోతట్టు,చుట్టుపక్కల భూములను ఆక్రమించుకుని అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడాలన్నారు. అలాగే పాపిరెడ్డి చెరువును కూడా బడాబాబులు ఆక్రమించారని చెప్పారు. ఆక్రమణదారులకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సహకరిస్తున్నారని చెప్పారు. స్పందించిన ఆర్డీవో శీనానాయక్ ప్రభుత్వ భూములు ఆక్రమణలపై విచారణకు ఐదు కమిటీలు వేశామని వివరించారు. కార్యక్రమంలో రమణయ్య, దుగ్గిరాల జార్జి,ప్రసాద్‌రెడ్డి,రమణయ్య, హరినాథ్ పాల్గొన్నారు.

దళిత యువకుడి మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

కందుకూరు, జూన్ 23: పట్టణంలోని ఉప్పుచెరువు కాలనీకి చెందిన దళిత యువకుడు ఎనుబోరి కిషోర్ మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నందున, సమగ్ర దర్యాప్తు జరపాలని వామపక్ష, దళిత బహుజన ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం వారు డీఎస్పీ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. కిషోర్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, అతనికి ఈత కూడా వచ్చని, అయితే ఆయన నీటిలో మునిగి చనిపోయి శవంగా కనిపించటం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరపాలని డీఎస్పీ శ్రీనివాస్ సీఐ హఫీజ్‌ను ఆదేశించారు. డీఎస్పీని కలిసిన వారిలో దళితసంఘాల నేతలు బొక్క వెంకటేశ్వర్లు, పాలేటి కోటేశ్వరరావు, ముప్పవరపు కిషోర్, బూసి సురేష్‌బాబు, షేక్ హుస్సేన్, రేణమాల అయ్యన్న, హరిప్రసాద్, చనమాల కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు తెలుగుదేశం పార్టీ శ్రేణుల బైక్ ర్యాలీ



జలదంకిలో సమావేశమైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

జలదంకి,, జూన్24: కాకర్ల సురేష్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి మొదటిసారిగా నియోజకవర్గానికి మంగళవారం రానుండటంతో ఘనస్వాగతం పలికేందుకు మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు సోమవారం సమావేశమయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుడు పీ మధుమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనసేన మండల కన్వీనర్ తోట మురళీ, బీజేపీ మండల అధ్యక్షుడు కంచర్ల శరత్ పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం 3గంటలకు జమ్మలపాలెం వద్ద ఎమ్మెల్యేకు భారీ స్వాగతం పలికి, అక్కడి నుంచి మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. వేలాదిగా జమ్మలపాలెంకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నేతలు వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, మునగాల తిరుమలరెడ్డి, జనసేన జిల్లా నేత నిమ్మలపల్లి రామ్‌చైతన్య, జమ్మలపాలెం మాజీ సర్పంచి నక్కా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : ఉదయగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాకర్ల సురేష్ మంగళవారం నియోజకవర్గంలో అడుగిడుతున్న సందర్భంగా జలదంకి మండలం జమ్మలపాలెం నుంచి మంగళవారం బైక్‌ర్యాలీ ప్రారంభమవుతుందని టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి తెలిపారు. జలదంకి మండలం నుంచి కలిగిరి మండలంలోకి ప్రవేశించే సందర్భంగా భారీ స్వాగత ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 12 అర్జీలు

కందుకూరు, జూన్ 24 : స్థానిక సబ్‌కలెక్టరు కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జి సబ్ కలెక్టరు టీ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై 12 అర్జీలు అందజేశారు. ఈ సమస్య ల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీచేశామని సబ్ కలెక్టరు తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి సబ్ కలెక్టరు పద్మావతి

అర్జీలు అక్కడే పరిష్కరించకుంటే చర్యలు

కావలి : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆర్డీవో శీనా నాయక్ తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజాసమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు

బిట్రగుంట : మండలంలో అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని తహసీల్దారు వెంక టరత్నం అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి చెరువు ఆక్రమణల తొలగింపును ఇరిగేషన్ అధికారి జితేంద్రర్‌రెడ్డి సోమవారం చేపట్టారు. ఇబ్రహీంపేట, కప్పరాళ్ళతిప్ప మధ్య ఏర్పాటు చేసిన లేఅవుట్లో చెరువుకు సంబంధించిన భూమి ఉందని అధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేయగా, 2.57 ఎకరాలు ఉందని, అందులో ప్రహరీ నిర్మాణం చేపట్టడంతో తొలగింపు చర్యలు చేపట్టారు.

దాడి చేశారని ఫిర్యాదు

కావలి రూరల్ : పట్టణంలోని జనతాపేటకు చెందిన బెల్లంకొండ హరిక్రిష్ణపై అదే ప్రాంతానికి చెందిన వెంకటమహేష్, మరికొందరు రాడ్‌తో దాడిచేసి గాయపరిచినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు, జనతాపేట నార్తుకు చెందిన హరిక్రిష్ణ భార్య పద్మ ఆదివారం రాత్రి ఇంటి ముందు మంచం వేసుకుని పిల్లలకు అన్నం పెడుతున్నది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న అదే ప్రాంతానికి చెందిన శిరీష 'మీరు ఇంటి ముందు మంచం వేస్తే.. మేము ఎలా వెళ్లాలి' అని గొడవకు దిగటంతో ఆమె భర్త మహేష్, మరిది వెంకటస్వామి కూడా అక్కడకు వచ్చారు. అప్పటికే అక్కడకి వచ్చిన పద్మ భర్త హరిక్రిష్ణ వారిని మందలించారు. దీంతో వారు రాడ్‌తో హరిక్రిష్ణ తలపై కొట్టారు. తీవ్రగాయాలతో ఆయన వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గోపిచంద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డయేరియా నివారణపై సమావేశం

బిట్రగుంట : వాతావరణంలో వస్తున్న మార్పులు, తాగునీటి కాలుష్యంతో డయేరియా వచ్చే అవకాశం ఉందని, దాన్ని నివారించేందుకు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో జమీఉల్లా అధ్యక్షత వహించారు. వ్యాధిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యాధికారులకు తెలియ చేయాలని కోవూరుపల్లి వైద్యులు నిత్యప్రశాంతి పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు.

రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు

ముత్తుకూరు, జూన్ 24 : రక్తదానం ప్రాణదానంతో సమానం అని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు అన్నారు. సోమవారం అదాని కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని సీఓఓ రాజన్‌బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడి, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యవంతమైన ప్రతిఒక్కరూ రక్తదాతలు కావాలన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం వలన వారి ప్రాణాలు కాపాడిన వారమవుతామని తెలిపారు. పోర్టు ఉద్యోగులు, కార్మికులు రక్తదాన శిబిరంలో పాల్గొని 283 మంది రక్తదానం చేయడం హర్షనీయమన్నారు. రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఈహెచ్‌ఎస్ ఏజీ ఎం వేణుగోపాల్‌రెడ్డి, అదాని ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు మధుసూదన్‌రావు, భాస్కర్ సాయిరాం, పోర్టులోని వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అడ్మిన్, ఈహెచ్‌ఎస్ టీం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పోర్టు ప్రతినిధులు



తెప్పపై చాముండేశ్వరి వైభోగం

ఇందుకూరుపేట : గంగపట్నంలోని చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారి తెప్పోత్సవం జరిగింది. అనంతరం అమ్మవారు గంగపట్నం పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో నావూరు శ్రీనివాసుమూర్తి, మనోజ్ కుమార్, శాంతన్‌కృష్ణ, మొద్దుకూరు సుధాకర్, కార్యనిర్వహణ అధికారి బండి శాంతయ్య, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి అభినందనలు


వేమిరెడి దంపతులతో కల్యాణ్‌రెడ్డి

ఇందుకూరుపేట, జూన్ 24: నెల్లూరు పార్లమెంటు సభ్యుడిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సోమవారం టీడీపీ యువ నాయకుడు కల్యాణ్‌రెడ్డి ఢిల్లీలో ఆయన్ని కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్; కోడూరు కమలాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్రికెట్ విజేత కొమ్మలపూడి జట్టు

మనుబోలు, జూన్ 24: మండలంలోని కుడితిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం కుడితిపల్లి, కొమ్మలపూడి జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొమ్మలపూడి జట్టు విన్నర్‌గా నిలవగా, కుడితిపల్లి జట్టు రన్నర్‌కు పరిమితమైంది. విన్నర్ జట్టుకు రూ.15వేలు నగదు, ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ. 10వేలు, ట్రోఫీలను దాతలు జట్లకొండూరు టీడీపీ నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి , చలమల ధనుంజయ, బండి సాయిలు అందజేశారు.

ఆంజనేయస్వామి భూముల వేలం

తోటపల్లిగూడూరు : చింతోపు పంచాయతీ మజారా ఆంజనేయపురంలోని నెల్లూరు నవాబుపేట సీతారామాంజనేయస్వామి ఆలయానికి చెందిన మాగాణి భూముల వేలంపాట సోమవారం దేవస్థానం అధికారులు నిర్వహించారు. ఆలయ ఈవో కవిత ఆధ్వర్యంలో వేలంపాట నిర్వ హించగా, పాటదారుడు వెంకురెడ్డి సదరు భూములకు మూడు సంవత్సరాల కాలపరిమితి మేరకు సంవత్సరానికి రూ. 346100కు లీజ్ హక్కులు పొందారు. గతంలో కంటే రూ. లక్షా 14వేలు అదనంగా ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ వేలంపాటలో ఇందుకూరుపేట మాజీ జడ్పీటీసీ కైలాసం ఆదిశేషారెడ్డి, మాగుంట రమణారెడ్డి, పైనం కోటేశ్వరరావు, చంద్రశేఖర్, పాటదారులు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి

రాపూరు(డక్కిలి) : ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జీఓ నెం.117ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రాపూరులో సోమవారం యుటీఎఫ్ సభ్యత నామోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు వెంకటేశ్వర్లు, అంకయ్య, బాలప్రసాద్, రవికాంత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

● మంత్రి సత్యప్రసాద్‌కు రెవెన్యూ ఉద్యోగుల వినతి

ముత్తుకూరు, జూన్ 24: రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు సోమవారం రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యాయులు దేవరాజ్, ప్రధాన కార్యదర్శి మొలతాటి గిరీష్, నాయకులు లక్ష్మీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

గ్రామాల్లో డయేరియా నివారణ చర్యలు చేపట్టాలి

మనుబోలు, జూన్ 24: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది సమన్వయంతో పనిచేసి డయేరియా నివారణ చర్యలు చేపట్టాలని మనుబోలు పీహెచ్‌సీ వైద్యురాలు గేయపూజిత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం డయేరియా నివారణ చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ విస్తరణాధికారి జీవీఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ రోజూ ట్యాంకుల్లో క్లోరినేషన్ నీటిని వదలాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు చేతులు శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటిసరఫరా జేఈ. కార్తీక్‌రెడ్డి, ఎంఆర్‌సీ కోఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గేయపూజిత

చైతన్య భారతి కళాశాలపై చర్య తీసుకోవాలి : టీఎన్‌ఎస్‌ఎఫ్

వెంకటాచలం, జూన్ 24: నిబంధనలు పాటించని స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట సోమవారం టీఎన్‌ఎస్‌ఎఫ్ మండలాధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి ఆధ్వర్యంలో విద్యార్థి నేతలు ఆందోళన చేశారు. ఈసందర్భంగా వెంకటాద్రి మాట్లాడుతూ కళాశాలపై చర్యలు తీసుకోవాలని గతంలో వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కాగా, పోలీసులు ఆందోళన చేస్తున్న విద్యార్థి నేతలకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఆందోళన విరమించే ప్రసక్తే లేదని భీష్మించారు. దీంతో వర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి వచ్చి ప్రత్యేక కమిటీని నియమించి విచారణ చేసి చైతన్య భారతి డిగ్రీ కళాశాలతోపాటు నిబంధనలు పాటించని కళాశాలల గుర్తింపును వెంటనే రద్దుచేస్తామని హామీ ఇవ్వడంతో టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు ఆందోళన విరమించారు.

తిరుమల పాదయాత్ర భక్తులకు సన్మానం

పొదలకూరు, జూన్ 24: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో తిరుమల శ్రీవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు, ఆర్యవైశ్య సోదరులు తల్లాం శేఖర్, టంగుటూరు శివ, పొలిశెట్టి రాము తిరుమలకు చేపట్టిన మహా పాదయాత్ర సోమవారం పొదలకూరుకు చేరుకుంది. ఈసందర్భంగా స్థానిక ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య, సభ్యులు పొట్టి సుధాకర్, గుర్రం మీరా మధు ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తున్న సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య నాయకులు, రాచపూటి ధనుంజయరావు, పిన్నెలి ప్రభాకర్, రాజా సురేంద్ర, పైడా కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల మద్దతు

వెంకటాచలం, జూన్ 24: సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందడంతో మొక్కులో భాగంగా టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ చేపట్టిన తిరుమల పాదయాత్రకు టీడీపీ నేతలు మద్దతు పలికారు. సోమవారం వేకువజామున వెంకటగిరి సమీపంలోని అంజనేయపురం నుండి ప్రారంభమైన పాదయాత్ర రాత్రికి అలిపిరికి చేరుకుంది.

గుమ్మళ్ళదిబ్బలో 'నేను బడికి పోతా'

కోవూరు, జూన్ 24: గుమ్మళ్ళ దిబ్బ కాలనీలో జడ్పీ పాఠశాల విద్యార్థులు సోమవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చెంచులక్ష్మి మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లల్ని పాఠశాలల్లో చేర్పేందుకు అందరూ కృషిచేయాలన్నారు. జడ్పీ పాఠశాల నుంచి బీసీ కాలనీ, ఎస్టీ కాలనీ వరకు ప్రదర్శన చేశారు. ప్రదర్శనలో ఎంఈఓ చెంచులక్ష్మి, హెచ్‌ఎం ఇంద్రావతి, ఉపాధ్యాయులు మల్లికార్జున, పీడీ మధుసూదన్, అజయకుమార్, వేణుగోపాల్, శ్రీనివాసులు, గంగాధర్ పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పీవోబీ భూములు ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలి

మనుబోలు, జూన్ 24: గ్రామంలో పీవోబీ భూములను ఆక్రమించి, పట్టా పొలాల్లో కలుపుకున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ బద్దెవోలు టీడీపీ నాయకులు శానంపూడి సురేంద్రరెడ్డి, మదుసూదన్ సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సుమన్, మరికొందరు ఐదేళ్ళుగా నిషేధిత భూములైన ప్రభుత్వ, పోరంబోకు, డొంకలు, పొర్లుకట్టలు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. దీంతోపాటు చెరువు పొర్లుకట్టలను తీసేసి పొలంలో కలిపేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ వీఆర్‌వో, సర్వేయర్‌ను పంపి విచారణ చేసి, చర్యలు తీసుకుంటామన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

గనుల భద్రతా వారోత్సవాల ప్రారంభం

సైదాపురం, జూన్ 24: గనుల భద్రతా వారోత్సవాలు సోమవారం ప్రాంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని వసంత కల్యాణి మైకామైన్, శ్రీకల్యాణ రామ మైకా మైన్‌లలో గనుల భద్రత వారోత్సవాల పరిశీలన బృందం పర్యటించారు. అనంతరం మైనింగ్ పరిసరాలు, కార్మికుల భద్రత, ప్రభుత్వ మైనింగ్ నిబంధనలు పలు అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో మైన్ మేనేజర్లు వి.వాసు, యం.ప్రసాద్, పి.నాగసాయికృష్ణ, ప్రవీణ్, శివయ్య, పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి సోమిరెడ్డి సంతాపం

వెంకటాచలం, జూన్ 24 : మండలంలోని ఎగువమిట్ట గ్రామానికి చెందిన టీడీపీ నేత పల్లిపాటి మునీంద్రబాబు అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. అలాగే తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి ఈపూరు సుబ్బారెడ్డి, తదితరులు ఎగువమిట్టకు చేరుకుని మునీంద్రబాబు పార్థివ దేహానికి నివాళులర్పించారు.

బైక్ దగ్ధంపై ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్24: మండలంలోని జొన్నవాడ గిరిజనకాలనీలో ఆదివారం అర్థరాత్రి ఇంట్లో పెట్టిన బైక్‌ను యువకులు తగులబెట్టి పరారయ్యారని బాధితులు నాటకరాని శ్రీనివాసులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ హైమారావు సంఘటనా స్థలంతోపాటు గిరిజన కాలనీలో విచారించారు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి




అసాంఘికాలకు అడ్డాగా సీపీఎం పాఠశాల

ఛీ ఏఎం

నగరంలోని మూలాపేటలోని సీపీఎం పాఠశాల ఎందరినో ఉన్నత విద్యావంతులను చేసి అత్యున్నతస్థాయికి చేర్చింది. ప్రస్తుతం ఆదరణ కోల్పోయి మూతపడి అసాంఘికాలకు అడ్డాగా మారింది. నిరుపయోగంగా ఉన్న ఈ పాఠశాల ప్రాంగణంలో నిత్యం ఆకతాయిలు హల్‌చల్ చేస్తున్నారు. మత్తుకు బానిసైన యువత అక్కడే గంజాయి, మద్యం సేవించి ఖాళీ సీసాలను పడేస్తున్నారు. దీంతోపాటు మత్తు ఇంజక్షన్ (డ్రగ్స్) వాడి ఖాళీ సిరంజిలు ఆ ప్రదేశంలో పడేస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ హత్యలు కూడా జరిగాయి. దీంతో అటువైపు జనం రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ప్రజా సమస్యలను అశ్రద్ధ చేయొద్దు : కమిషనర్

నెల్లూరు(సిటీ), జూన్ 24 : నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అశ్రద్ధ చేయకుండా సత్వరం పరిష్కారం చూపాలని, ఎన్‌ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో ఆయన నగర వాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై సంబంధిత అధికారులు లోతుగా దర్యాప్తు చేయాలన్నారు. తద్వారా సదరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. ఒక ప్రాంతం, ఒక వ్యక్తి నుంచి వచ్చిన వినతి మరొకసారి రాకూడదని స్పష్టం చేశారు. ప్రతి సమస్యను నిర్ణీత కాల వ్యవధిలోపు పరిష్కారం చూపాలన్నారు.


సమస్యలు వింటున్న కమిషనర్ వికాస్ మర్మత్

సాంఘిక సంక్షేమశాఖ మంత్రిని కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 24 : రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖామంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య, పలువురు నేతలు సోమవారం అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించారు. మాదిగల సంక్షేమానికి సంబంధించి పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పలిగిల వెంకటరమణయ్య, తాటిపర్తి రఘు, నందిపాటి డానియర్, ఎస్కే రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన ఏపీ ఎన్‌జీవో సంఘం నేతలు

నెల్లూరు(వైద్యం), జూన్ 24 : రాష్ట్ర వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేయశాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను సోమవారం జిల్లా ఎన్‌జీవో అసోసియేషన్ నేతలు అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందిచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయానికి టీవీ బహూకరణ

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 24 : నగరంలోని రాజ రాజేశ్వరి ఆలయానికి 55 అంగుళాల ఎల్‌ఈడీ టీవీని సోమవారం దాతలు అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తుల క్యూలైన్లు పర్యవేక్షించేందుకు పత్తి సరళ జ్ఞాపకార్థం పత్తి రామకృష్ణ దీనిని ట్రస్ట్ బోర్డు సభ్యురాలు మాలేపాటి పద్మజ ద్వారా ఆలయ సహాయ కమిషనర్, ఈవో వెంకటసుబ్బయ్యకు అందజేశారు.

మలేరియా వ్యాధిపై అవగాహన ఉండాలి

నెల్లూరు రూరల్, జూన్ 24 : మలేరియా జ్వరాలపై క్షేత్రస్థాయిలో అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప అన్నారు. నెల్లూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంబాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా అత్యంత ప్రమాదకర వ్యాధి అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఈ వ్యాధిని దూరం చేసుకోవచ్చని తెలిపారు. ప్రజల చైతన్యం కోసం ప్రభుత్వం మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో మెగా జాబ్‌మేళా

నెల్లూరు(విద్య), జూన్ 24 : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి మాట్లాడుతూ చెన్నై, శ్రీసిటీలకు చెందిన 8 కంపెనీల ప్రతినిధులు ఈ మేళాకు హాజరయ్యారన్నారు. జిల్లా వ్యాప్తంగా 213 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 52 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు భవిష్యత్‌లో ఉత్తమ అవకాశాలు కల్పించేందుకు మున్ముందు మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, వేణు, సిబ్బంది పాల్గొన్నారు.


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గిరి



చతుష్కుండ హోమాలు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 24 : నగరంలోని గురువాయుర్ మహావిష్ణు ఆల యంలో పుష్కర మహాకుంభాభిషేకం మహో త్సవాల్లో భాగంగా సోమవారం చతుష్కుండములలో హోమాలు జరిగాయి. పుణ్యాహ వచనం, పంచగవ్య ప్రోక్షణం, రక్షాబంధనం, మూల మూర్తికి అష్టోత్తర శత కలిశాభిషేకం, ద్వారతోరణం, మహాకుంభ, చక్రాజ్జ, మండల ప్రతిష్ఠ ఆరాధన, పూర్ణాహుతి, మం గళహారతి, శాత్తుముర్రై ఘోష్టి, అన్నప్రసాద వితరణ జరిగాయి. ఉభయకర్తలు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 24 : నగరంలోని మాగుంట లే అవుట్‌లో ఉన్న ప్రసన్నవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి పుష్పయాగం, ఉదయం నిత్యహోమం, బలిహరణం, మంగళ శాసనం, చూర్ణోత్స వం, (ముత్తైదువులు పసుపు దంచుట) పంచ కలిశ స్నపన అభిషేకం, అవభృదోత్సవం చక్రస్నానం, మంగళ శాసనాలు, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం శ్రీవారికి పుష్పాభిషేకం, అశ్వ వాహన సేవ మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం, దేవతోద్వాసనం జరిగాయి. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయం మారుమోగింది.



రామోజీరావును యువత ఆదర్శంగా తీసుకోవాలి

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 24 : ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ దివంగత రామోజీరావును యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ అన్నారు. సోమవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సంతాపసభలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావు సమాజానికి వివిధ రంగాల ద్వారా దిశ, దశా నిర్ధేశించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వీ వెంకటేశ్వర్లు, జర్నలిస్టులు రమేష్‌బాబు, జీ హనూక్, జొన్నలగడ్డ కోణార్క్, మాటేటి రత్నప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జాషువా గ్రంథాలయ పనులపై సమీక్ష

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 24 : నగరంలోని పాత జూబ్లీ ఆసుపత్రి ఆవరణంలోని జాషువా గ్రంథాలయం పునఃనిర్మాణ పనులపై సోమవారం సాయంత్రం నగర కమిషనర్ వికాస్ మర్మత్ సమీక్షించారు. జాషువా గ్రంథాలయ కమిటీ సభ్యులతో ఆయన తన చాంబర్‌లో ఇప్పటి వరకు జరిగిన పనులు, జరగాల్సిన పనులకు ఏ మేరకు నిధులు కావాలనే విషయాలను చర్చించారు. ఈ సమావేశంలో గ్రంథాలయం కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కె.ఖాసిం, చీఫ్ అడ్వయిజర్ కె.కుసుమకుమారి, ఆర్గనైజర్ కొమ్మల కృష్ణయ్య ఇన్‌చార్జ్ జనార్ధన్, ఖాజామొహిద్దీన్, ఎస్‌వీఎస్ ప్రసాద్, తదితరులు వినతిపత్రం అందజేశారు.

సంఘ విద్రోహ శక్తుల తాటతీస్తాం

● తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు పనబాక


మాట్లాడుతున్న పనబాక భూలక్ష్మి

నెల్లూరు(వైద్యం), జూన్ 24 : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం హంతకులు, రేపిస్టులు, దుర్మార్గుల వంటి సంఘ విద్రోహ శక్తుల తాటతీస్తుందని టీడీపీ అనుబంధ తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నేరగాళ్లకు కొమ్ము కాసిందని ఆరోపించారు. చీరాల మండలం ఈపురుపాళెంలో బహిర్భూమికి వెళ్లిన మహిళపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కేవలం 36 గంటల్లో పోలీసులు పట్టుకున్నారన్నారు. ఏ ఆడబిడ్డ బలి కాకుండా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో లక్షకు పైగా మహిళలపై దాడులు జరిగితే ఒక్క నిందితుడిని శిక్షించలేదన్నారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ జగన్మోహన్‌రెడ్డి ఇంట్లో మహిళా కమీషన్‌గా పనిచేశారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టీడీపీ మహిళా కార్యదర్శి శ్రీదేవి, సెల్వి, శాంతి, రాజీ, కాంతమ్మ, ధనమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రిని కలిసిన రూప్

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెం ట్ సభ్యుడిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రమాణస్వీకోత్సవం కోసం ఢిల్లీ వెళ్లిన రూప్‌కుమార్ పార్లమెంట్ ఆవరణలో రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి ఎన్నికల్లో విజయం సాధించి పదవి చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు.



నగదు చెల్లించకనే దర్గాలో మార్కింగ్‌లు

నెల్లూరు (సాంస్కృతికం) : బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ సందర్భంగా హుండీల కలెక్షన్, శాశ్వత దుకాణాల అద్దె వసూలు, పండుగ జరిగే 5రోజులు తాత్కాలిక దుకాణాలకు నేల బాడుగ వసూలు కోసం ఈ నెల 20వ తేదీన రాష్ట్ర వక్ఫ్‌బోర్డు టెండర్లు పలిచింది. రూ.1,57,59,824లకు నగరానికి చెందిన షేక్.ఫయాజ్ అహ్మద్ దక్కించుకున్నారు. వేలం మొత్తంలో మొదటి 10 రోజుల్లో రూ.95,18,965 చెల్లించాలి. రెండు విడతల్లో మిగిలిన నగదు చెల్లించాలి. అయితే, సదరు కాంట్రాక్టరు తొలివిడత నగదు చెల్లించకనే షాపుల ఏర్పాటుకు మార్కింగ్ పనులు చేయిస్తున్నారు. దీనిపై వక్ఫ్‌బోర్డు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇది తెలిసిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కాంట్రాక్టరును డబ్బుల చెల్లించాకే కొలతలు వేసుకోమని హెచ్చరించినట్లు సమాచారం.



హవ్వ... ఇవి సౌధాలట!




కపిలతీర్థం కూడలి వద్ద ఉన్న టీడీపీ తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయం. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సొంత స్థలంలో నిర్మించుకున్న చిన్న భవనం



తిరుపతి - రేణిగుంట రోడ్డులోని ఆటోనగర్ వద్ద నరసింహయాదవ్ ఏర్పాటు చేసుకున్న జిల్లా టీడీపీ ఆఫీసు. ఇది అద్దె భవనం

ఎంతటి అబద్ధాన్నైనా దబాయించి చెబితే నిజం అవుతుందన్నది జగన్‌రెడ్డి సిద్ధాంతం. అబద్ధాలను వండివార్చి వడ్డించడంలో ఆయన సొంత పత్రిక ఆరితేరింది. ఊరూరా రుషికొండ తరహా ప్యాలెస్‌లను వైసీపీ ఆఫీసుల పేరుతో నిర్మిస్తున్న సంగతి బట్టబయలు కావడంతో ఉలిక్కిపడ్డ జగన్ పార్టీ టీడీపీపై ఎదురుదాడికి దిగింది.టీడీపీ కూడా జిల్లాల్లో పచ్చ సౌధాలు నిర్మించుకుందంటూ ఒక ఫొటో కథనాన్ని సోమవారం అచ్చేసి వదిలింది. ఇందుకు సాక్ష్యంగా రాజకోటల్లా ఉన్నాయంటూ టీడీపీ తిరుపతి జిల్లా కార్యాలయం, తిరుపతి నగర కార్యాలయం ఫొటోలను కూడా ప్రచురించింది. విమానాశ్రయానికి అత్యంత సమీపంలో ఎకరాకు ఏడాదికి వెయ్యి రూపాయల అద్దెకు రెండెకరాల విలువైన ప్రభుత్వ భూమిని 33 ఏళ్లకు సొంతం చేసేసుకున్న జగన్‌రెడ్డి పార్టీకి ప్రయివేటు ఇరుకు భవనాల్లో నడుస్తున్న టీడీపీ ఆఫీసులు సౌధాల్లా కనిపించడం విశేషం. మొహం నిండా అమాయకత్వాన్ని పులుముకున్నంత మాత్రాన అబద్ధం, నిజమైపోదనేందుకు ఈ ఫొటోలే సాక్ష్యం.



తిరుపతి విమానాశ్రయం దగ్గర రెండు ఎకరాల విస్తీర్ణంలో దాదాపుగా పూర్తయిన వైసీపీ ఆఫీసు భవనం

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుమలలో శ్రీలీల

తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : సినీ హీరోయిన్ శ్రీలీల సోమవారం తిరుమలకు వచ్చారు.జీఎంఆర్ అతిథిగృహంలో బస చేశారు.మంగళవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

సీజన్ ముగిసేటప్పుడూ ధరాఘాతమే



పుత్తూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మామిడి కాయలు

ఒకే రోజు రూ.5 వేలు తగ్గిన తోతాపురి

ధరను భారీగా తగ్గించేసిన పల్ప్ ఫ్యాక్టరీలు

జూదాన్ని తలపిస్తోందంటున్న మామిడి రైతు

పుత్తూరు అర్బన్, జూన్ 24: మామిడి సీజన్ ముగింపు దశకు చేరుకుంది. ఆఖరులోనైనా మంచి ధర లభిస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రధానంగా పల్ప్ ఫ్యాక్టరీలు వినియోగించే తోతాపురి ధర జూదాన్ని తలపిస్తోందనే మాటలు వినబడుతున్నాయి. ఒకే రోజు టన్నుపై రూ.5 వేలు తగ్గడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్ప్ ఫ్యాక్టరీల సిండికేట్ పుణ్యమా అని ఈ ఏడాది కూడా మామిడి రైతులు నష్టాలనే మూటగట్టుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్క రోజులో పతనం

మామిడి సీజన్ ఈ ఏడాది ఒడిదుడుకుల మధ్యే ప్రారంభమైంది. పుత్తూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సీజన్ ప్రారంభమైన మే మాసంలో ప్రధాన రకమైన తోతాపురి టన్ను రూ.20 వేలు పలికింది. జూన్ మొదటి వారం వచ్చేసరికి రూ.28 వేలకు చేరింది. ఈ ఏడాది దిగుబడి కేవలం 20 శాతం మాత్రమే ఉండడంతో ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారు. అయితే రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ పల్ప్ ఫ్యాక్టరీలు రోజుకో ధరను నిర్ణయిస్తూ తోతాపురి ధరను పక్కా జూదంగా మార్చేశాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం టన్ను రూ.27 వేలు పలికిన తోతాపురి సోమవారానికి రూ.22 వేలకు పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

మిగిలింది పుల్లూరా రకమే....

జిల్లాలో తోతాపురి తరువాత అత్యధికంగా సాగులో ఉండే మామిడి రకం పుల్లూర(నీలం). దీని ధర కూడా అంతంత మాత్రంగానే ఉంది. సోమవారం పుత్తూరు మార్కెట్ యార్డులో టన్ను రూ.30-35 వేలు పలికింది. సాధారణంగా రోజుకు 100 టన్నులు వచ్చే పుల్లూర రకం ప్రస్తుతం యార్డుకు సరాసరి 18 టన్నులు మాత్రమే వస్తున్నట్లు మండీ యజమానులు చెబుతున్నారు. అయితే కనీసం పుల్లూర రకం మామిడికైనా మంచి ధర లభించేలా వ్యవసాయ మార్కెటింగ్ విభాగం అధికారులు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాధారణంగా సీజన్ ముగింపు దశకు చేరుకున్నప్పుడు సరఫరా తగ్గిపోవడంతో ధరలు పెరుగుతాయి. అయితే ఈ ఏడాది మాత్రం ముగింపు సమయానికి ధరలు పతనమవుతుండడంతో రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ల ఆదేశాలు తూచ్

పల్ప్ ఫ్యాక్టరీల సిండికేట్‌ను పసిగట్టిన రైతులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ద్వారా ఈ నెల 9వ తేదీన సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. తోతాపురికి గిట్టుబాటు ధర కల్పించాలని విన్నవించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వం తోతాపురి ధర విషయంలో జోక్యం చేసుకుంది. తిరుపతి, చిత్తూరు జిల్లా కలెక్టర్ల ద్వారా టన్ను రూ.30 వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయితే ఏ రోజూ ఫ్యాక్టరీలు కలెక్టర్లు నిర్దేశించిన ధరకు కొనుగోలు చేయలేదు.దీంతో సీజన్ ముగింపులో కూడా ఫ్యాక్టరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతుల కష్టాలను సొమ్ము చేసుకుంటున్నాయనే విమర్శలు తలెత్తుతున్నాయి.

రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా హనుమంతరావు

ఏడు నెలలుగా సెలవులో ఉన్న అధికారిని నియమించడంపై విమర్శలు

గతంలో పనిచేసిన శాఖలో రిలీవ్ కాకనే కొత్త పోస్టులో చేరడంపై చర్చ



బాధ్యతలు స్వీకరించిన హనుమంతరావు

తిరుపతి(వైద్యం), జూన్ 24 : రుయాస్పత్రిలో డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ సి.హనుమంతరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అయితే ఏడు నెలలుగా మెడికల్ లీవులో ఉన్న ఆయన తాను గతంలో పనిచేసే శాఖలో రిలీవ్ కాకుండానే ఏకంగా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టారన్న విమర్శలొస్తున్నాయి. ఆస్పత్రి వర్గాల్లో దీనిపై చర్చ నడుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. హనుమంతరావు గతంలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో గూడూరు డివిజన్‌కు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించే వారు. అనారోగ్య కారణాలతో గత ఏడాది నవంబరు ఒకటినుంచి ఈనెల 17వ తేదీవరకు మెడికల్ లీవులో ఉన్నారు. ఈ క్రమంలో తిరిగి విధుల్లో చేరుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారికి రిపోర్టు చేయలేదు. ఈ పరిస్థితుల్లో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి ఆయన్ను నేరుగా రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా నియమించడమే విమర్శలకు తావిచ్చింది.

నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు కాలేజీలో పనిచేశారు!

ఇవన్నీ ఇలా ఉంటే.. హనుమంతరావు మెడికల్ లీవులో ఉన్నప్పుడు నిబంధనల విరుద్ధంగా పుత్తూరు మండలంలోని అన్న గౌరి మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారని సమాచారం.

టాస్క్‌ఫోర్సు ఎస్పీ బాధ్యతల స్వీకారం



తిరుపతి(నేరవిభాగం), జూన్ 24: ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరుదైన ఎర్రచందనం సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అటవీ, పోలీసు, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుపై ఉందన్నారు. అందువల్ల అన్నిశాఖలతో సమన్వయం చేసుకుని ఎర్రచందనం స్మగ్లింగ్ అడ్డుకోవడంపై దృష్టి పెడతామన్నారు. దీనికి ప్రజలు, మీడియా సహకారం అవసరమన్నారు.

పీజీఆర్ఎస్‌కు 119 ఫిర్యాదులు

దాదాపు మూడు నెలల తరువాత వినతులను స్వీకరించిన అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 24 : ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ఫిర్యాదుల స్వీకరణ ప్రక్రియ ఎన్నికల కోడ్ వచ్చాక ఆగిపోయిన సంగతి తెలిసిందే.మూడు నెలల తరువాత తిరుపతి కలెక్టరేట్ సహా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో స్పందన పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) పేరుతో నిర్వహించారు.జిల్లా నలుమూలలనుంచి విచ్చేసిన జనం సమస్యలపై వినతిపత్రాలను సమర్పించారు.ప్రభుత్వ తాజా మార్గదర్శకాల ప్రకారం ఒక క్రమ పద్ధతిలో అర్జీదారులు వేచి ఉండేలా గదిని ఏర్పాటు చేశారు.ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర, డీఆర్వో పెంచల కిషోర్, ఇతర జిల్లా అధికారులు వినతులు స్వీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 119 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర

గ్రీవెన్స్ డేలో ఎమ్మెల్యే నాని



చంద్రగిరి, జూన్ 24: చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని విచ్చేశారు.అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.రెవెన్యూ సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. చంద్రగిరిలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలను,వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని పోలీసులను ఆదేశించారు.

వైసీపీ నేతలు బెదిరించి రాజీనామా చేయించారు

● మాజీ వలంటీర్ల గోడు



శ్రీకాళహస్తిలో కరోనా వంటి సమయాల్లో ఎంతో నిబద్ధతతో పనిచేసి ప్రజలకు సేవలందించాం. అయితే ఎన్నికల సమయంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి ఆదేశాల మేరకు ఆయన అనుచరులు బెదిరించి తమ చేత రాజీనామాలు చేయించారని శ్రీకాళహస్తి నుంచి విచ్చేసిన వందమందికి పైగా వలంటీర్లు కలెక్టరేట్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు.తాము రాజీనామా చేసిన తేదీలకు ముందే మున్సిపల్ కమిషనర్ లాగిన్ నుంచి విధుల నుంచి తొలగించినట్లు అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు.సీఎం చంద్రబాబు కరుణించి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

పింఛను కోసం ఐదేళ్లుగా తిరుగుతున్నా

ఐదేళ్లుగా పెన్షన్ కోసం కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనికరించలేదని పుత్తూరుకు చెందిన అంధుడు రాధాకృష్ణ అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.



అంధుడు రాధాకృష్ణను తీసుకెళుతున్న కలెక్టరేట్ సిబ్బంది

పట్టా భూమిని డీకేటీ చేశారు



తన పేరుతో సాగు చేసుకుంటున్న 78సెంట్ల సెటిల్‌మెంట్ పట్టా భూమిని విక్రయించాలని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే ఆ భూమి డీకేటీలో వుందంటున్నారని ఏర్పేడు మండలం చెల్లూరు హరిజనవాడకు చెందిన కృష్ణయ్య వాపోయాడు.ఇందుకు కారకులైన ఏర్పేడు రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని తన భూమి తనకు ఇప్పించాలని కృష్ణయ్య కోరారు.

బర్డ్‌లో ఆగిన ఉచిత మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు

తిరుపతి(వైద్యం), జూన్ 24: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బర్డ్ ఆస్పత్రిలో ఈనెల ఒకటో తేదీనుంచి ఉచిత మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు నిలిపేయడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. బర్డ్ ప్రత్యేకాధికారిగా గతంలో పనిచేస్తున్న డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి గత నెల 31వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. మరుసటి రోజునే ఆయన స్థానంలో ఆర్ఎంవో డాక్టర్ కిశోర్‌కుమార్‌ని ఇన్‌చార్జిగా టీటీడీ నియమించింది. ఆయన బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే ఈ శస్త్ర చికిత్సలను నిలిపేశారు. కేవలం నగదు చెల్లించిన వారికి మాత్రమే శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. వీటిల్లో మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స తర్వాత అమర్చే ఇంప్లాంట్ సాధారణమైనది రూ.72వేలు, నాణ్యమైనదైతే రూ.1.35 లక్షలు చెల్లించాలి. మూడు వారాల వ్యవధిలో దాదాపు 70కిపైగా మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేశారు. వీటిల్లో అన్నీ నగదు చెల్లించిన వారికి మాత్రమే చేయడం విశేషం. ఇక గత ప్రభుత్వ హయాంలో సిఫారసులున్న వారికే శస్త్ర చికిత్సలు చేసేవారు. తాజాగా ఉచిత శస్త్రచికిత్సలు పూర్తిగా ఆపేయడంతో నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై బర్డ్ ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి, ఆర్ఎంవో కిశోర్‌కుమార్‌ను వివరణ కోరగా.. రెగ్యులర్ డైరెక్టరు లేనందున ఉచిత శస్త్ర చికిత్సలు చేయడం లేదని చెప్పారు. కేవలం నగదు చెల్లించిన వారికి మాత్రమే చేస్తున్నామన్నారు. రెగ్యులర్ డైరెక్టరును నియమించే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

... అను నేను

చిత్తూరు,తిరుపతి ఎంపీలుగా సోమవారం దగ్గుమళ్ల ప్రసాదరావు, గురుమూర్తి లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేశారు.





నేడు, రేపు కుప్పంలో సీఎం పర్యటన

కుప్పం, జూన్ 24: తన సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలో మంగళ, బుధవారాల్లో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఆయన తొలిసారిగా కుప్పం వస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.55 గంటలకు శాంతిపురం మండలంలోని జల్లిగానిపల్లె, 1.35 గంటలకు చిన్నారిదొడ్డి గ్రామ సమీపంలో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువను పరిశీలించి కుప్పంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. 3 గంటలకు ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4.40 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పార్టీ నేతలతో సమావేశమవుతారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గ అధికారులతో అభివృద్ధిపై సమీక్షిస్తారు. 2.40 గంటలకు పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. సాయంత్రం 4.10 గంటలకు హెలికాప్టరులో బెంగళూరుకు బయలుదేరి వెళ్తారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మరోవైపు తమ నాయకుడికి ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ నేతలు, శ్రేణులు సిద్ధమవుతున్నారు.

వైద్యం అందించాల్సిన చేతితో....

తండ్రి చితికి నిప్పంటించిన తనయ



తండ్రి చితికి నిప్పంటిస్తున్న సాయిబిందు

నాయుడుపేట టౌన్, జూన్ 24: వైద్యం అందించాల్సిన చేతితో తండ్రి చితికి నిప్పంటించింది ఓ మెడిసిన్ విద్యార్థిని. నాయుడుపేట పట్టణంలోని రామకృష్ణాపురంలో నివాసం ఉంటున్న రామకృష్ణారెడ్డి (63) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సాయిబిందు జార్జీయాలో వైద్యవిద్య చివరి సంవత్సరం చదువుతోంది. రెండో కుమార్తె బీటెక్ పూర్తి చేసింది. ఈ క్రమంలో తండ్రి మరణ వార్తను సాయిబిందుకు కుటుంబ సభ్యులు తెలిపారు. జార్జీయాలో ఉన్న సాయిబిందు నాయుడుపేటకు సోమవారం మధ్యాహ్నం చేరుకుంది. అనంతరం తండ్రి దహన క్రియలను దగ్గరుండి నిర్వహించింది. డాక్టర్‌గా తండ్రికి సేవలు అందించాల్సిన తాను చితికి నిప్పు పెట్టాల్సిన పరిస్థితి రావడంపై విలపించింది. కుటుంబసభ్యులు ఓదార్చి దహనక్రియలను పూర్తి చేయించారు.

టెన్త్‌లో ప్రతిభావంతులకు నగదు పురస్కారం



నాయుడుపేట, జూన్ 24: మండలంలోని అన్నమేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సోమవారం నగదు పురస్కారాన్ని అందజేశారు. 600కు 569 మార్కులు సాధించిన ఝాన్సీకి రూ.5వేలు, అస్మిత(557)కు రూ.3వేలు, యామిని(551)కి రూ.2వేలు, 500 మార్కులు దాటిన 8 మంది విద్యార్థులకు తలా రూ.వెయ్యిని పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్‌రావు, సర్పంచ్ జ్యోతి, ఎంపీపీ మధు, విద్యాకమిటీ సభ్యుడు సుబ్రహ్మణ్యం, చిగురవాడ పద్మనాభం, కుమారస్వామిరెడ్డి అందజేశారు. గణితంలో 100 మార్కులు సాధించిన ఝాన్సీకి రూ.2వేలును గణిత ఉపాధ్యాయుడు చక్రవర్తి, సాంఘిక శాస్త్రంలో 99 మార్కులు సాధించిన శ్రావణ్‌కుమార్‌కు రూ.2వేలను ఉపాధ్యాయురాలు రేణుక అందజేశారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న అరుణకుమారి

నాయుడుపేట, జూన్ 24: డ్రగ్స్ వినియోగంతో అనేక రుగ్మతలు రావడంతోపాటు వారి జీవితాలు, కుటుంబాలు నాశనమవుతాయని నాయుడుపేట సర్కిల్ సెబ్ సీఐ అరుణకుమారి అన్నారు. పట్టణంలోని శ్రీవేమ జూనియర్ కళాశాలలో సోమవారం వరల్డ్ యాంటీ డ్రగ్స్‌డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్ వినియోగంతో విచక్షణ కోల్పోతారన్నారు. సీఐ శ్రీనివాసులురెడ్డి, శ్రీవేమ విద్యాసంస్థల అధినేత టి.శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అతిసార నిర్మూలనకు పటిష్ఠ చర్యలు

నాయుడుపేట, జూన్ 24: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అతిసార ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి ఆదేశించారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 13 సచివాలయాల సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కలెక్టర్ ఆదేశాల మేరకు 5 సంవత్సరాల పిల్లలకు ముందస్తుగా ఓఆర్‌ఎస్, జింక్ ప్యాకెట్లను అందించాలన్నారు. ప్రతి ఒక్కరు చేతులను, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షిత నీరు తాగాలని అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పబ్లిక్ టాయిలెట్లను ప్రతి రోజు శుభ్రపరచాల్సి ఉందన్నారు.

గురుకులాలను పారదర్శకంగా నిర్వహించండి

● ఎమ్మెల్యే విజయశ్రీ



ప్రిన్సిపాళ్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, జూన్ 24: గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యాభ్యాసం, మౌలిక సదుపాయాలను నాణ్యతా ప్రమాణాలతోపాటు పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆదేశించారు. నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో సోమవారం సూళ్లూరుపేట నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆమె సమీక్షించారు. గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఆమేరకు పని చేయాలన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించండి

సూళ్లూరుపేట/దక్కిలి/ వాకాడు/ పెళ్లకూరు/చిల్లకూరు, జూన్ 24: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉందని అన్ని గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని సూళ్లూరుపేట ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య తదితరుల శాఖ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తాగునీటి సరఫరాలతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. డీటీ చైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి, వైద్యాధికారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంతోపాటూ తాగునీటి నాణ్యత పరీక్షలను వేగవంతం చేయాలని దక్కిలి ఎంపీడీవో లీలామాధురి ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షా కిట్లను సచివాలయ సిబ్బందికి అందించామన్నారు. ఈవోపీఆర్డీ ఎస్‌కె అల్లాబక్ష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. వాకాడు పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో బాలిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కల్పన, ఎంపీడీవో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అతిసార కట్టడిపై సమావేశం నిర్వహించారు. చిల్లకూరు ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో భానుమూర్తి ఆధ్వర్యంలో డయేరియా నివారణ చర్యలపై సమావేశం నిర్వహించారు. పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అన్నపూర్ణరావు ఆధ్వర్యంలో అతిసార ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కొత్త ఆవిష్కరణలతో విద్యార్థులకు భవిత

కేంద్ర మాజీ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్



క్రియా వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

శ్రీసిటీ, జూన్ 24: కొత్త ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తే భవిష్యత్తు విద్యార్థులదేనని కేంద్ర ప్రిన్సిపల్ సైంటిఫిక్ మాజీ అడ్వైజర్ విజయరాఘవన్ అన్నారు. శ్రీసిటీలోని క్రియా యూనివర్శిటీలో సోమవారం జరిగిన స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విభిన్న దృక్కోణాల నేపథ్యంలో విద్యార్థులు ప్రపంచాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. క్రియా, చెన్నై వర్సిటీలకు చెందిన 350 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీలు, అవార్డులు అందజేశారు. జెరూసలెంలోని హిబ్రూ వర్శిటీ హ్యూమనిస్టిక్ స్టడీస్ ప్రొఫెసర్ డేవిడ్ షుల్‌మాన్ రెనీలాంగ్, ప్రథమ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈవో డాక్టర్ రుక్మిణీ బెనర్జీలకు వారి రంగాల్లో విశేష సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. క్రియా వర్శిటీ ఛాన్సలర్ లక్ష్మీనారాయణన్, వీసీ నిర్మాలారావు, ఐఎఫ్‌ఎంఆర్ డీన్ లక్ష్మీకుమార్, ఎస్ఐఏఎస్ అకడమిక్ డీన్ డాక్టర్ పృథ్వీదత్తా చంద్రశోభి, రీసెర్చ్ విభాగ డీన్ శివకుమార్ శ్రీనివాసన్ ఇతర క్రియా అధికారుల సమక్షంలో పట్టాలను ప్రదానం చేశారు.

రద్దైన ఆర్టీసీ సర్వీసులు... ఇబ్బందుల్లో ప్రయాణికులు

● ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న గ్రామీణులు

వెంకటగిరి, జూన్ 24 : ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని ఆర్టీసీ అధికారులే సభలు, సమావేశాలు పెట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు. అయితే ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపకపోవం విమర్శలకు తావిస్తోంది. వెంకటగిరి ఆర్టీసీ డిపో పరిధిలో ఇటీవల పెద్ద ఎత్తున సర్వీసులు రద్దు చేయడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

వెంకటగిరిలో 1987లో ఆర్టీసీ డిపో ప్రారంభించినప్పుడు 80 బస్సులు అందుబాటులో ఉంచారు. కాలక్రమేణా బస్సు సర్వీసులు పెంచాల్సింది పోయి గణనీయంగా తగ్గించేయడంతో ప్రయాణిలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం 38 ఆర్టీసీ బస్సులు, 21 హైర్ బస్సులు నడుస్తుండగా వీటిలో ఇటీవల 9 హైర్ బస్సు సర్వీసులను రద్దు చేయడంతో గ్రామీణులకు కష్టాలు మొదలయ్యాయి. గతంలో వెంకటగిరి- నెల్లూరు మధ్య 10 సర్వీసులు తిరిగేవి. ప్రస్తుతం 6 బస్సులు మాత్రమే తిప్పుతున్నారు. ఇదేవిదంగా వెంకటగిరి - తిరుపతి మధ్య నాలుగు బస్సులు రద్దు చేయడంతో ప్రస్తుతం ఆరు సర్వీసులే నడుస్తున్నాయి. జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం ప్రజలు వెళ్తుంటారు. చాలినన్ని బస్సులు నడపకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. తిరుమలకు వెళ్లే బస్సులు కూడా నిలిపి వేశారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వెంకటగిరి, కడప నుంచి ప్రతి రోజు చెన్నైకి వెళ్లేఆర్టీసీ బస్సులను రద్దు చేయడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. ఒక్క సారిగా బస్సులు రద్దు చేయడంపై ప్రయాణికులు ఆర్ఎంకు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా 8 బస్సులు తిప్పుతున్నారు. ఇక వెంకటగిరి - శ్రీకాళహస్తి, వెంకటగిరి - నాయుడుపేట మధ్య కూడా చాలినన్ని బస్సులు నడపడం లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మంగళం..

ఇక గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సేవలు పూర్తిగా మంగళం పాడారన్న విమర్శలున్నాయి. దీంతో గ్రామీణ ప్రజలుకు ఆటోలు, ప్యాసింజర్ వాహనాలే దిక్కయ్యాయి. వెంకటగిరి నుంచి మోపూరుకు ఉదయం మాత్రమే ఆర్టీసీ బస్సు వస్తుందని సాయంత్రం రాకపోవడంతో స్కూళ్లకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం ఆటోలను ఆశ్రయిస్తున్నారు. డిపో మేనేజరు వైఫల్యం కారణంగా వెంకటగిరిలో ఈ దుస్థితి నెలకొందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ జిల్లా స్థాయి అధికారులు ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న వెంకటగిరి ఆర్టీసీ డిపో ప్రాంగణం

ఆక్రమణల చెరలో ఆర్‌అండ్‌బీ స్థలం





రైల్వే స్టేషన్ ప్రాంతంలో చదును చేసిన ఆర్‌అండ్‌బీ స్థలం

నాయుడుపేట, జూన్ 24: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని ఆర్‌అండ్‌బీ స్థలంలో వాణిజ్య ఆక్రమణలకు భూములను చదునుచేస్తూ ఆక్రమణలకు తెరదీశారు. గతంలో రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, ఫ్లైఓవర్ ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ స్థలాలు దర్జాగా ఆక్రమించి శాశ్వత కట్టడాలను ఏర్పరుచుకున్నారు. పట్టణంలోని దర్గావీధి, వెల్‌కం సెంటర్, బీఎస్ఎన్‌ఎల్ ఆఫీసు ప్రాంతాల్లో మాత్రమే ఆక్రమణలను తొలగించారు. మిగిలిన చోట్ల కోట్ల రూపాయల ఆక్రమణలు యథావిధంగా ఉన్నాయి. మళ్లీ ఇప్పుడు రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ స్థలం చదును చేసి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు కానీ మున్సిపాలిటీ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. అలా విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

గూడూరులో ఎమ్మెల్యే సునీల్ విజయోత్సవ ర్యాలీ



ఆర్టీసీ బస్టాండు వద్ద కమలాపండ్ల మాలతో సునీల్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

గూడూరు అర్బన్, జూన్ 24: తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన గూడూరు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని పాశిం సునీల్‌కుమార్ అన్నారు. అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం గూడూరుకు విచ్చేసిన సందర్భంగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విఘ్నేశ్వరపురంలోని విఘ్నేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆయనకు కమలాపండ్ల మాలతో స్వాగతం పలికారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి రాజావీధి మీదుగా టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీలో అడుగడుగునా నాయకులు, కార్యకర్తలు, స్థానికులు బాణసంచా పేల్చుతూ గజమాలలతో స్వాగతం పలికారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము కక్షసాధింపు చర్యలకు పాల్పడమని అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. వైసీపీ పాలనలో వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారన్నారు. తన గెలుపుకు కారణమైన కొండేపాటి గంగాప్రసాద్, నానాజీతోపాటు టీడీపీ, బీజేపీ, జనసేన, అన్ని వర్గాల ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, చాన్‌బాషా, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్‌రహీం, కిషోర్‌నాయుడు, వెంకటేశ్వర్లురెడ్డి, చంద్రనీల్, నయీం, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 24: టీడీపీ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు యేటా రూ.20 వేలు అందిస్తామని చెప్పారు. రైతులకు ఏ కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని చెప్పారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం తోపాటు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యాన్ని నిల్వచేసుకొని గిట్టుబాటు ధర వచ్చేవరకు భద్రపరిచేందుకు గోదాములు నిర్మిస్తామన్నారు. కూరగాయలు, ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనూజారెడ్డి, టీడీపీ నాయకులు పప్పు చంద్రమౌళిరెడ్డి, కెవీకే ప్రసాద్ నాయుడు, పి.విశ్వనాథనాయుడు, బి.రాజేశ్వరరావు, కె.శ్రీనివాసులు నాయుడు, పి.కోటేశ్వరరెడ్డి. ఏ.రామచంద్రయ్య నాయుడు సహా ఏడీఏ నాగార్జున సాగర్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు శ్రీవారి ప్రసాదాలు



చంద్రగిరి, జూన్ 24: వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌ని చంద్రగిరి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

సూర్యప్రభపై వెంకన్న విహారం



గూడూరు, జూన్ 24: పట్టణంలోని రాజావీధిలో కొలువైవున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్టింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.67 కోట్లు

తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.67 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 81,455 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,251 మంది తలనీలాలు సమర్పించారు.

కుప్పం డిపోకు 9 ఆర్టీసీ బస్సుల తరలింపు

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 24: కుప్పం ఆర్టీసీ డిపోకు తిరుమల, అలిపిరి డిపోల నుంచి తొమ్మిది బస్సులు ఆదివారం రాత్రి తరలించారు. గతంలో ప్రయాణికుల అవసరాల అనుగుణంగా ఈ బస్సులను కుప్పం డిపో నుంచే రప్పించారు. అవి తిరిగే (తిరుమల-కృష్ణగిరి) మార్గాలు, సమయాలను యథావిధిగా ఉంచి డిపోల పేర్లను మాత్రమే మార్చారు. అంటే తిరుమల-తిరుపతి మధ్య ఓ ట్రిప్పు తిరిగాక కృష్ణగిరికి వెళ్లివచ్చేవి. ప్రస్తుతానికి ఎలక్ట్రిక్ బస్సులు విరివిగా అందుబాటులో ఉండడంతో కొన్ని డీజల్ బస్సుల రాబడి కాస్త తగ్గుముఖం పట్టింది. ఈ క్రమంలో అధికారులు చర్యలు చేపట్టి యథాస్థానానికి ఆ తొమ్మిది బస్సులను తరలించారు. అదే సమయంలో భక్తులకు కొరత లేకుండా తిరుపతి డిపో నుంచి రెండు బస్సులు తిరుమల డిపోకు కేటాయించారు. ఇవి తిరుమల-తిరుపతి మధ్య నడుస్తాయి. అలాగే తిరుమల, తిరుపతి, అలిపిరి, మంగళం డిపోల్లో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లకు కుప్పం డిపోకు మారేందుకు కూడా అవకాశం కల్పించారు.

సమస్యల పరిష్కార వేదికతో కార్యాలయాలు కళకళ



సూళ్లూరుపేటలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

గూడూరు, జూన్ 24: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభంతో రెవెన్యూ కార్యాలయాలు సోమవారం కళకళ లాడాయి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించేవారు. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా పరిష్కార వేదికను నిర్వహించలేదు. దీంతో అర్జీదారులు లేక కార్యాలయాలు వెలవెలబోయాయి. సోమవారం తిరిగి ప్రారంభమవడంతో కిటకిటలాడాయి.

పెళ్లకూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు కె.వి.ఆర్.వి.ప్రసాద్‌రావు తెలిపారు. భూసమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఆర్ఐ సంతోషిబాయి, ఏవో తదితరులు ఉన్నారు.

సూళ్లూరుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు తీసుకొని సంబంధిత అధికారులకు వాటిని పంపారు. వ్యవసాయ ఉపసంచాలకులు అనిత, ఏవో కవిత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఇరిగేషన్ ఏఈ ఠాగూర్ పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: ప్రజా సమస్యల అర్జీలను సత్వరం పరిష్కారం చేస్తున్నట్లు తహసీల్దారు కల్యాణి తెలిపారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి ఆయా శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేవారు.

ఓజిలి: ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాంచారయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ... ఇకపై ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ సెల్‌ను నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల ఏర్పాటు

చిల్లకూరు, జూన్ 24: మండలంలోని వరగలిక్రాస్‌రోడ్డు సమీపంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు శ్రీనివాసులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఏర్పాటు చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలతో తమ కార్యలయంలో ఏర్పాటు చేసినట్టు తహసీల్దారు తెలిపారు.

ఎస్టీ గురుకులాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



గురుకుల వంటశాలలో కూరగాయల పరిశీలనలో శ్రీహరి తదితరులు

గూడూరు అర్బన్, జూన్ 24: మండలంలోని చెన్నూరు ఎస్టీ గురుకుల పాఠశాలను సోమవారం డీఎంహెచ్‌వో శ్రీహరి తనిఖీ చేశారు. శనివారం మధ్యాహ్న భోజనం సందర్భంగా కలుషిత నీరు తాగి ఎస్టీ గురుకుల పాఠశాలలో 15మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. అస్వస్థతకు గల కారణాలను తెలుసుకునేందుకు డీఎంహెచ్‌వో సోమవారం గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాగునీటి నమూనాను పరీక్షకు పంపించామని, నివేదిక రావాల్సివుందన్నారు. అదేవిధంగా పిల్లలకు వడ్డించే ఆహార పదార్థాలను, కూరగాయలను, పరిసరాలను పరిశీలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మధుసూదన్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తమిళ జాలర్ల చొరబాటుపై అధికారుల ఆరా

కోట, జూన్ 24 : కోట, వాకాడు మండలాల పరిధిలోని సముద్రంలోకి తమిళ జాలర్లు అక్రమ చొరబాటుపై అధికారులు ఆరా తీస్తున్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మళ్లీ ప్రారంభమైన జాలర్ల ఆట' అన్న కథనంపై కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు తహసీల్దారు డి.నాగరాజరావు కోట మండలం గోవిందపల్లిపాళెం, కొత్తపట్నం, శ్రీనివాసస్రతం పరిధిలోని సముద్రంలో తమిళనాడు నుంచి వస్తున్న బోట్ల వివరాలను పంపాలని, అక్కడ జరుగుతున్న వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని మండలస్థాయి మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. అదే విధంగా జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు ఆయా మండలాల్లో తమిళ బోట్ల చొరబాట్లపై మత్స్యకారులు, ఇటు మత్స్యశాఖ ప్రతినిధులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



స్వర్ణముఖి నదిలోకి వెళ్లకుండా అధికారులు తవ్వించిన గాడి

నాయుడుపేట టౌన్, జూన్ 24: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టారు. నాయుడుపేట స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో నదికి పలు ప్రాంతాలలో ఎక్స్‌కవేటర్‌తో గాడులు తవ్వించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు చేపడుతామని అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు.

ఎన్‌బీకేఆర్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట, జూన్ 24 : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 4వ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పెరేడ్ ట్రైనింగ్, గన్ ఫైరింగ్, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆయుధ శిక్షణ, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా 16 మంది క్యాడెట్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. నెల్లూరుకు చెందిన ఏపీఎస్‌ఆర్ ప్రభుత్వ డాక్టర్ అనిత రక్తాన్ని సేకరించారు. మల్లికార్జున్‌రెడ్డి, గోపీనాథ్, నరేంద్ర, గణేష్ ఉన్నారు.

టీడీపీ ర్యాలీకి తరలిన తెలుగు తమ్ముళ్లు



గూడలి నుంచి బయలు దేరుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

కోట, జూన్ 24 : టీడీపీ ఆధ్వర్యంలో గూడూరులో జరిగిన ఎమ్మెల్యే సునీల్ విజయోత్సవ ర్యాలీకి కోట నుంచి భారీగా తరలివెళ్లారు. గూడలి నుంచి పార్టీ మండల ఉపాధ్యక్షుడు పి.వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు కార్లు, బైక్‌లలో నినాదాలు చేసుకుంటూ భారీగా తరలివెళ్లి ఎమ్మెల్యే పాశింకు స్వాగతం పలికారు. అదే విధంగా పార్టీ మండల అధ్యక్షుడు ఎం.సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, ఎస్.మోహన్‌రెడ్డి, పి.భాస్కర్‌రెడ్డి, మధుయాదవ్ ఆధ్వర్యంలో కూడా గూడూరుకు భారీగా తరలివెళ్లారు.

మృతుడి కుటుంబానికి నగదు వితరణ

కోట, జూన్ 24: పట్టణంలోని దళితవాడలో ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్తీక్ అలియాస్ పండు కుటుంబానికి సోమవారం బీసీ కులాల ఐక్యవేదిక స్పందించింది. పండు అంత్యక్రియలకు సంస్థ తరఫున ఎం.గోపీకృష్ణ రూ.5వేలను వితరణగా అందజేశారు.

విద్యార్థి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

గూడూరు అర్బన్, జూన్ 24: స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రూ.20 వేలు, లయన్స్‌క్లబ్ రూ.20వేలను బీటెక్ విద్యార్థికి వైద్యఖర్చులకు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ రియాజ్‌అహ్మద్ మాట్లాడుతూ... ఓజిలి మండలం పెదపరియకు చెందిన బీటెక్ విద్యార్థి రేవంత్‌రెడ్డి ప్రమాదవశాత్తు చెట్టు నుంచి పడడంతో వెన్నెముక దెబ్బతినిందన్నారు. దీంతో విద్యార్థి వైద్యఖర్చులకు ఆర్థికసాయం అందజేశామన్నారు. మురళీరెడ్డి, రామ్మోహన్‌రావు, ఎం రమణయ్య, కళ్యాణ్‌సాయి, రూపేష్‌రెడ్డి, వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.